Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు, పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు పసమూలికలతో వైద్యసేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు, ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు


జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :64 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు మంగళవారం 14 జూలై 2026 పేజీలు :12 వేల రూ5 /-


## వరుస పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు..

**ఛాత్రోన్ కీ గూంజ్‌కి పిలుపు..**

**న్యూఢిల్లీ:** భారత విద్యా వ్యవస్థపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ ఇవాళ (సోమవారం) తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆయన ఆరోపించారు. వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు, అవినీతిపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఎంపీ రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా అవినీతి, అన్యాయం, పక్షపాతం, నిజాయితీ లేని వ్యవస్థ అనే పదాలు తనవి కాదని రాహుల్ అన్నారు. అవి భారత విద్యా వ్యవస్థ గురించి విద్యార్థులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలని పేర్కొన్నారు.



విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం - మిగతా3లో

## 61 కోట్లు దాటిన డిజిటల్ పేమెంట్స్

**హైదరాబాద్ జూలై 13:** స్మార్ట్‌ఫోన్లలో ఉండే బయోమెట్రిక్ అథెంటికేషన్ (ఆన్–డివైస్) ఆధారంగా జరిగిన యూపీఐ పేమెంట్లు 2026 జూన్ నెలలో 61.1 కోట్లు దాటాయి. ఈ మొత్తం లావాదేవీల విలువ రూ. 25,416 కోట్లుగా నమోదైంది. రోజువారీ అవసరాల కోసం ప్రజలు ఈ విధానాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఫింగర్‌ప్రింట్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి UPI పేమెంట్లను సులభంగా పూర్తి చేయవచ్చు. యూపీఐ వినియోగదారులు తమ రోజువారీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్ ఆధారిత - మిగతా3లో





## భారీగా తగ్గిన బంగారం ధరలు

**ముంబాయి:** దేశంలో బంగారం ధరలు భారీగా తగ్గాయి. 24క్యారెట్ల 10గ్రా. బంగారం ధర రూ.1420 తగ్గి రూ.1,42,910కి చేరింది. 22క్యారెట్ల 10గ్రా. బంగారం రూ.1300 తగ్గి రూ.1,31,000కి చేరింది. కిలో వెండి ధర రూ.2,40,000.

## ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్‌దర్వాజా వరకు బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు.**

**బోనాల ఉత్సవాల నిమిత్తం 3427 దేవాలయాలకు 15 కోట్ల 5 లక్షల 41 వేల 150 రూపాయలు విడుదల.**

**హైదరాబాద్:** భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారుల సమన్వయం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలతో ప్రారంభం జూలై 20,21,22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ



కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా 20 న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం,21న - మిగతా3లో

## విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట..

**గోవధ నిషేధ ఉత్తర్వులపై స్టే!**



**న్యూఢిల్లీ, జులై 13:** తమిళనాడులో గోవధను పూర్తిగా నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు ఇవాళ (సోమవారం) స్టే విధించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు 'సవరణ' ) అవసరమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం పెద్ద ఊరటనిచ్చింది. బక్రీద్ పండుగ సందర్భంగా లేదా మరే ఇతర రోజుల్లోనైనా రాష్ట్రంలో ఆవులు, దూడల వధ జరగకుండా చూడాలంటూ మే 27న మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్దా ఖలు చేసింది.

**చట్ట నిబంధనలకు విరుద్ధంగా తీర్పు: తమిళనాడు ప్రభుత్వం**

హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం తన వాదనలను వినిపించింది. రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం.. కొన్ని నిర్దిష్ట కేటగిరీల ఆవులను, అనుమతించిన ప్రాంతాలలో వధించడానికి చట్టబద్ధమైన అనుమతి ఉందని ప్రభుత్వం పేర్కొంది.

## జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**హైదరాబాద్, జులై 13 :** జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వ్యాఖ్యానించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను పెంచుతున్నామని



వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన తెలంగాణ బీజేపీ..

**తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం**


**హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రారంభం**

**కిషన్ రెడ్డి, రాంచందర్ రావు సహా పలువురు నేతలతో 2 రోజుల యాత్రకు శ్రీకారం**

**బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపణ**

**మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని వెల్లడి**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ బీజేపీ సోమవారం 'సింగరేణి భరోసా యాత్ర'ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితర నేతలు ఈ రెండు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఖమ్మం జిల్లాకు చేరుకున్న వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ యాత్రలో భాగంగా నాలుగు జిల్లాల్లోని సింగరేణి గనుల కార్మికులను కలిసి, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను



వివరించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయింపు - మిగతా3లో

## పాతబస్తీలో ఓట్ల గల్లంతు గండం

**SIRతో ఓవైసీ ఆందోళన - సగం ఓటర్లు తగ్గిపోతారా?**

**హైదరాబాద్, జూలై 13:** తెలంగాణలో ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాగుతున్న ఓటర్ల స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ ప్రక్రియ హైదరాబాద్ పాతబస్తీ లో తీవ్ర రాజకీయ కాక రేపుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా పౌరసత్వం, స్థానికతను నిరూపించుకోవడానికి అధికారులు కఠినమైన ధృవీకరణ పత్రాలను అడుగుతుండటంతో పాతబస్తీలోని లక్షలాది మంది సామాన్య ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి వద్ద తగిన పాత నివాస ఆధారాలు, లీగల్ డాక్యుమెంట్లు లేకపోవడంతో




పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిణామం ఎంఐఎం అగ్రనేత అసదుద్దీన్ ఓవైసీని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తన సొంత రాజకీయ కోటను కాపాడుకునేందుకు రంగంలోకి దిగిన ఓవైసీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి తెరలేపారు. పాతబస్తీ ఓటర్ల సమస్యపై నేరుగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో చర్చించేందుకు ఎంఐఎం నాయకత్వం ప్రయత్నించినప్పటికీ, సీఎం అపాయింట్‌మెంట్ దొరకడం లేదంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుండటంతో, ఎంఐఎం ప్రతినిధి బృందం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి తమ డిమాండ్లను విన్నవించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162 ని ఉపయోగించి, - మిగతా3లో

## పోలవరం వివాదం... సుప్రీం కోర్టులో తెలంగాణకు షాక్

**న్యూఢిల్లీ, జూలై 13:** పోలవరం ప్రాజెక్టుపై తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో లోపాలున్నాయంటూ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఏపీ ప్రభుత్వానికి తక్షణ నోటీసులు, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం తోసిపుచ్చింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, గోదావరి నీటి వినియోగం, పోలవరం–బనకచర్ల అనుసంధానం వంటి అత్యంత కీలకమైన అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ వివాదాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం



విచారణ చేపట్టింది. ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, ప్రాజెక్టుల లింకేజీలపై నెలకొన్న వివాదాలు కొనసాగుతున్న సమయంలో ఈ విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేయాలని, అలాగే ఏపీ ప్రభుత్వానికి తక్షణమే నోటీసులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోర్టును అభ్యర్థించింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. తెలంగాణ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నాయని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ఈ సందర్భంగా ఎత్తిచూపింది. ఆ లోపాలను పూర్తిగా సరిదిద్దే వరకు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టడం సాధ్యం కాదని కోర్టు స్పష్టం చేసింది.

వార్తాతరంగాలు

మంగళవారం 14 జూలై 2026

# సంపాదకీయం

## డిఫెన్స్ రంగంలోకి భారత్

వాస్తవానికి ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికా ఉంది. తర్వాత స్థానంలో చైనా ఉంది. రష్యా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఈ జాబితాలో ఇండియా వచ్చి చేరింది. ఆర్థికంగా బలోపేతమైన స్థానంలో ఉంది. ఇప్పుడు డిఫెన్స్ రంగంలో కూడా భారత్ సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఏకంగా చైనా కు దిమ్మ తిరిగే విధంగా షాకిచ్చింది.కొంతకాలం గా డిఫెన్స్ రంగంలో భారత్ అనేక రకాలుగా ప్రయోగాలు చేస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను రూపొందిస్తుంది. వివిధ దేశాలతో ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటున్నది. తన ఆయుధ శక్తిని ఇటీవల కాలంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రదర్శించింది. పాకిస్తాన్ లో ఉగ్రవాద శిబిరాల మీద దాడులు చేసింది. ఖచ్చితమైన లక్ష్యాల మీద దాడులు చేసి భారత్ తన స్థాయిని నిరూపించుకుంది. అయితే ఇక్కడితోనే భారత్ ఆగిపోవడం లేదు. ఏకంగా ప్రపంచ ఆయుధ శక్తులుగా వెలుగొందుతున్న అమెరికా, రష్యా తర్వాత భారత్ స్థానాన్ని సంపాదించుకుంది.భారతస్థాయిని డబ్ల్యూడిఎంఎంఏ సంస్థ తన వార్షిక ర్యాంకింగ్ ల ద్వారా ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉండడం విశేషం. ఆధునికీకరణ.. లాజిస్టికల్ మద్దతు.. పరస్పరంగా చేసే దాడులు.. రక్షణ సామర్థ్యాలు వంటి ఆధారంగా ఈ రేటింగ్ ఇచ్చింది. ప్రత్యేకమైన మిషన్, ప్రత్యేకమైన బాంబర్ దళం, సిఏఎస్ శిక్షణ.. వంటి వాటిని డబ్ల్యూ డి ఎం ఎం ఏ పరిధిలోకి తీసుకుంది. ఇందులో అత్యధికంగా టీవీఆర్ స్కోర్ 242.9. దీనిని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సాధించింది. ఆ తర్వాత స్థానంలో రష్యా ఉంది. రష్యా తర్వాత భారత్ కొనసాగుతోంది.టీవీఆర్ రేటింగ్స్ ప్రకారం చూసుకుంటే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 242.9 పాయింట్లు తో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో యునైటెడ్ స్టేట్స్ నేవీ విభాగం కొనసాగుతోంది. నేవీ విభాగానికి 142.4 టీవీఆర్ రేటింగ్ ఉంది. తర్వాత స్థానంలో 114.2రేటింగ్ తో రష్యన్ వైమానిక దళం కొనసాగుతోంది.. 112.6 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కొనసాగుతోంది. 85.3 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ మెరైన్స్ కొనసాగుతోంది. భారత వైమానిక దళం 64.9 టివిఆర్ రేటింగ్ తో ఆరవ స్థానంలో కొనసాగుతోంది.. వాస్తవానికి దేశాల ప్రకారం చూసుకుంటే అమెరికా మొదటి స్థానంలో.. రష్యా రెండవ స్థానంలో.. ఇండియా మూడో స్థానంలో ఉంది. 63.8 టివిఆర్ రేటింగ్ తో చైనా నాలుగో స్థానంలో.. ర్యాంకు పరంగా ఏడవ స్థానంలో ఉంది. పరేషన్ సిందూర్ తర్వాత భారత్ సొంత రక్షణపై మరింత దృష్టిపెట్టింది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో సరికొత్త ఆయుధాలను వేగంగా తయారు చేస్తోంది. ఇక ఇటీవలికాలంలో సముద్ర రక్షణపైనా మోదీ దృష్టి పెట్టారు. ఈమేరకు వివిధ దేశాలలో పర్యటిస్తూ.. సముద్ర రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు భారత నౌకాదళాన్ని బలోపేతం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐఎన్ఎస్ మహేంద్రగిరిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఈ స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ భారతదేశ రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి మరో ముఖ్యమైన ఉదాహరణగా నిలిచింది. ఇది కేవలం ఒక నౌక కమిషనింగ్ మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం వైపు సాగుతున్న ప్రయాణంలో ఒక మైలురాయి.ఈ యుద్ధనౌక స్టెల్త్ టెక్నాలజీతో తయారైంది. దీని రూపకల్పనతో శత్రు రాడార్ల నుంచి సులభంగా గుర్తించడం కష్టం. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు, అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ సామర్థ్యాలు దీనిలో భాగం. ఇవి బహుముఖ యుద్ధ పరిస్థితుల్లో నౌకను అత్యంత సమర్థవంతంగా మార్చుతాయి. ఆధునిక ఆయుధ వ్యవస్థలతో సన్నద్ధమైన ఈ ఫ్రిగేట్ భారత నౌకాదళం మొత్తం సామర్థ్యాన్ని పెంచుతుంది.

ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఆరవ స్టెల్త్ ఫ్రిగేట్. ఈ ప్రాజెక్టు ద్వారా భారతదేశం విదేశీ సాంకేతిక సహాయం లేకుండా అధునాతన యుద్ధనౌకలను నిర్మించే సామర్థ్యాన్ని సాధించింది. స్వదేశీ నిర్మాణం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా, సాంకేతిక జ్ఞానం స్వంతం అవుతుంది. ఇది రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను పటిష్టం చేస్తుంది, భవిష్యత్తులో మరిన్ని నౌకల నిర్మాణానికి పునాది వేస్తుంది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వానికి భారతదేశం ఒక ముఖ్యమైన భరోసాగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వాణిజ్యంలో 90 శాతం కంటే ఎక్కువ సముద్ర మార్గాల ద్వారా జరుగుతుంది. అందువల్ల సముద్ర భద్రతను కాపాడడం ఆర్థిక వృద్ధికి, జాతీయ భద్రతకు అవసరం. భవిష్యత్ యుద్ధాల్లో కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సైనిక బలగాలకు రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. ఇది కేవలం ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొనడానికి మాత్రమే కాకుండా, రేపటి మారుతున్న యుద్ధ వ్యూహాలకు సిద్ధం కావడానికి కూడా ముఖ్యం.ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఆగమనం భారతదేశం సముద్ర రక్షణ వ్యూహాన్ని బలపరుస్తుంది. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్లు భారత్‌ను 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మార్చడానికి సహాయపడతాయి. స్వదేశీ నిర్మాణం ఆర్థికంగా లాభదాయకం మాత్రమే కాకుండా, విదేశీ ఆధారిత్వాన్ని తగ్గిస్తుంది. భవిష్యత్తులో సముద్ర యుద్ధాలు మరింత సాంకేతికంగా మారే అవకాశం ఉంది. సముద్ర భద్రతను కాపాడడం ద్వారా భారతదేశం తన ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకోవడమే కాకుండా, ప్రాంతీయ శాంతిని కాపాడే బాధ్యతను కూడా నెరవేర్చగలుగుతుంది.కొంతకాలంగా డిఫెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ వింగ్ ను పూర్తిగా ఆధునికరిస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను.. యుద్ధ విమానాలను.. మిస్సైల్స్ ను తయారు చేస్తోంది. అందువల్లే ఇండియా మూడో స్థానంలో ఉంది. ఇదే రేంజ్ గనక కొనసాగిస్తే భారత్ రష్యా స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉందని డిఫెన్స్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# బీజేపీకి చుక్కలు చూపిస్తున్న పీకే



**పాట్నా, జూలై 13:**బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే పేరు మార్మోగుతోంది.. అదే ప్రశాంత్ కిషోర్ . మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి అజేయమైన కోటగా ఉన్న బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పీకే ఎంట్రీ ఇవ్వడమే ఆలస్యం, అక్కడ పొలిటికల్ మైండ్ గేమ్‌తో కమల దళానికి ఆయన చుక్కలు చూపిస్తున్నారు. నామినేషన్ వేసిన కేవలం 24 గంటల వ్యవధిలోనే బీజేపీ అభ్యర్థి అభిషేక్ సిన్హా అర్ధాంతరంగా బరి నుంచి తప్పుకున్నారు. ఒకప్పుడు తెరవెనుక ఉండి దేశవ్యాప్తంగా ఎందరో నాయకులను గెలిపించిన ఈ కింగ్‌మేకర్, ఇప్పుడు తానే నేరుగా ప్రజాక్షేత్రంలోకి దిగి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు.బంకీపూర్ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిషోర్ స్వయంగా నిలబడటంతో బీజేపీ తీవ్ర ఆత్మరక్షణలో పడింది. పీకే లాంటి చాణక్యుడి ముందు అభిషేక్ సిన్హా చాలా బలహీనమైన అభ్యర్థి అని ఆ పార్టీ అంతర్గత సర్వేల్లో తేలడమే కాకుండా, ఆయనకు సంబంధించిన కొన్ని వివాదాస్పద ఆర్థిక లావాదేవీల చిట్టా పీకే చేతికి చిక్కిందనే ప్రచారం పట్నా రాజకీయాలను కుదిపేస్తోంది. ఆ ఆధారాలు ఎన్నికల ప్రచారంలో బయటపడితే పార్టీ పరువు గంగలో కలుస్తుందని భావించిన అధిష్టానమే, బంటితో బలవంతంగా నామినేషన్ ఉపసంహరింపజేసింద భావిస్తున్నారు. ఈ పరిణామంతో, ప్రత్యర్థులను ఈడీ, సీబీఐలతో భయపెట్టే బీజేపీ.. ఇప్పుడు ఓటమి భయంతో తానే రంగు మార్చి పారిపోతోందంటూ పీకే వేసిన సెటైర్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.నష్టనివారణ చర్యల్లో ఓ బీజేపీ యువజన విభాగంలో పనిచేసే నీరజ్ కుమార్ సిన్హాను కొత్త అభ్యర్థిగా అత్యవసరంగా బరిలోకి దించింది. ఐదుసార్లు వరుసగా గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఖాళీ అయిన ఈ స్థానం, కమలదళానికి అత్యంత ప్రతిష్టాత్మకం. గత 2025 ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారిపై నితిన్ నవీన్ 51 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. అయితే, ఇప్పుడు పీకే స్వయంగా రంగంలో ఉండటం, ఆర్జేడీ తరఫున మళ్లీ రేఖా కుమారి పోటీలో నిలవడంతో ఈ ఉపఎన్నిక రసవత్తరమైన త్రిముఖ పోరుగా మారింది.జులై 30న జరగబోయే పోలింగ్, ఆగస్టు 3న వచ్చే ఫలితాలను ప్రశాంత్ కిషోర్ తన రాజకీయ భవిష్యత్తుకు ఒక రెఫరెండం గా ప్రకటించారు. మొదటి విడతలోనే అభ్యర్థిని మార్చాల్సి వచ్చేలా చేసి బీజేపీ డిఫెన్స్‌లో పడిందనే నెరేటివ్‌ను సెట్ చేయడంలో పీకే ఇప్పటికే సగం విజయం సాధించారు. మూడు దశాబ్దాలుగా జనసంఘ్, ఆర్ఎస్ఎస్ మూలాలున్న బంకీపూర్ ఓటర్లు పీకే డిజిటల్ , గ్రౌండ్ మేనేజ్‌మెంట్ ప్రయోగాలకు జై కొడతారా, లేక సాధారణ బూత్ స్థాయి కార్యకర్తని నిలబెట్టిన బీజేపీకే ఓటేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

# భయమా..ప్రకాష్ రాజ్ ?



**హైదరాబాద్, జూలై 13:**యూట్యూబర్ రావణ్ దేశద్రోహం, ఉపా చట్టం కింద అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన ఉదంతంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ పేరు ప్రముఖంగా తెరపైకి రావడంతో సోషల్ మీడియాలో ఆయనపై పెద్ద ఎత్తున ట్రోలింగ్, ప్రచారం మొదలైంది. దీనిపై ప్రకాష్ రాజ్ నా ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరంటూ కొత్తగా వీడియో విడుదల చేశారు. తాను మౌనంగా లేనని, జనసైనికులు, కొన్ని ఛానళ్లు, యూట్యూబర్లు చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని గమనిస్తున్నానని తెలిపారు. వీటన్నిటికీ దిగజారండి, దిగజారుతూనే ఉండండి అని వ్యాఖ్యానిస్తూ, వారి దిగజారుడుతనాన్ని ప్రపంచం చూస్తోందంటూ ట్వీట్ చేశారు. ప్రకాష్ రాజ్ పైపైన ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నా.. లోపల మాత్రం కేసు తీవ్రత చూసి తీవ్ర ఆందోళనలో ఉన్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దేశద్రోహం కేసులో ఇరుక్కున్న రావణ్‌తో ప్రకాష్ రాజ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనేది ప్రధాన ఆరోపణ. రావణ్‌తో పాటు కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి, ఏపీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యూహాత్మక కుట్రలు చేశారనే ప్రచారం గట్టిగా నడుస్తోంది. గతంలో రావణ్ చేసిన పలు వివాదాస్పద పోస్టులను, వీడియోలను ప్రకాష్ రాజ్ సపోర్ట్ చేస్తూ రీట్వీట్లు చేయడం.. ఇప్పుడు ఈ విచారణ తన దాకా వస్తుందనే భయంతోనే ఆయన ప్రశ్నించే గొంతు అంటూ ముందస్తు రక్షణ కవచం వెతుక్కుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రకాష్ రాజ్ కెరీర్ అంతా పరిశీలిస్తే.. ఆయన ఎప్పుడూ సమాజం కోసమో, సామాన్య ప్రజల సమస్యల కోసమో క్షేత్రస్థాయిలో ప్రశ్నించిన దాఖలాలు లేవనేది బహిరంగ రహస్యం. ఆయన వేసే ప్రశ్నలు కేవలం ఒక వర్గాన్ని టార్గెట్ చేసేలా, ఆయన వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలకు ఉపయోగపడేలా మాత్రమే ఉంటాయనే వాదన బలంగా ఉంది. అందుకే ప్రజాసమస్యలపై స్పందించని ఆయన ప్రశ్నల ను సామాన్యులు పెద్దగా పట్టించుకోరు. కానీ, ఈసారి వ్యవహారం కేవలం రాజకీయ విమర్శలతో ఆగిపోయేలా లేదు. ప్రభుత్వ నిఘా వర్గాలు, పోలీసులు ఈ డిజిటల్ కుట్రల వెనుక ఉన్న అసలు లింకులను పక్కా ఆధారాలతో బయటకు తీస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే కాబట్టి, నిజాలు పూర్తిగా నిరూపితమైతే ప్రకాష్ రాజ్ సైతం లీగల్ చిక్కులను, కఠిన చర్యలను ఎదుర్కోక తప్పదని భావిస్తున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారంలో పోలీసుల తదుపరి అడుగులు ప్రకాష్ రాజ్ మెడకు చుట్టుకునేలా కనిపిస్తున్నాయి. అరెస్ట్ అయిన రావణ్ మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌లలో లభ్యమైన కీలక డేటా, చాటింగ్ హిస్టరీతో పాటు.. ఈ ఛానల్‌కు ఫండింగ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గమన అనే మహిళను పోలీసులు త్వరలోనే విచారించనున్నారు. గమన నోటీసుల విచారణలో తేలే అంశాలు, రావణ్ ఫోన్ డాక్యుమెంట్లు క్రోడీకరిస్తే.. ఈ సోషల్ మీడియా నెట్‌వర్క్ వెనుక ప్రకాష్ రాజ్ పాత్ర ఏంటనేది అధికారికంగా బయటపడే అవకాశం ఉంది. తెరవెనుక నడిచిన అసలు కథ స్క్రిప్ట్ బయటకు వస్తే, అది ప్రకాష్ రాజ్ కే సమస్యలు తెచ్చిపెట్టవచ్చు.

# పబ్ లో ప్రమాదం... 27 మంది మృతి

**బ్యాంకాక్, జూలై 13:**థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బ్యాంకాక్‌లోని ఒక పబ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 27 మంది మృతి చెందారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేలోపే ఈ విషాదం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. బ్యాంకాక్ ఉత్తర భాగంలోని నా లాడ్‌ప్రావో పబ్‌లో భారీ మంటలు చెలరేగడం, ప్రధాన ద్వారం నుంచి దట్టమైన పొగ వెలువడడం వీడియోలో కనిపించింది. మందపాటి నల్లటి పొగ ఆకాశంలోకి ఎగసిపడుతుండగా, పబ్‌లోని జనాలు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన దృశ్యాలు వీడియోలో నమోదయ్యాయి. అర్ధరాత్రి సమయంలో ఈ అగ్నిప్రమాదం గురించి తమకు సమాచారం అందిందని అక్కడి పోలీసులు తెలిపారు. థాయ్‌లాండ్ ప్రధాన మంత్రి అనుతిన్ చార్న్‌విరాకుల్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు.అనంతరం ప్రధాన మంత్రి అనుటిన్ చార్న్విరాకుల్ ఘటనాస్థలిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రమాదంలో 27 మంది మరణించారని, గాయపడిన పలువురిని ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. పబ్‌లో ప్రదర్శన ఇస్తున్న తెలిపిన వివరాల ప్రకారం స్టేజ్ సమీపంలోని ఒక సర్క్యూట్ బ్రేకర్ నుంచి పొగ రావడం గమనించిన కొద్దిసేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, అనంతరం ఒక పేలుడు శబ్దం వినిపించిందని, వెంటనే దట్టమైన పొగ పబ్ అంతటా వ్యాపించిందని చెప్పారు. మృతుల్లో చాలామంది పబ్ వెనుక భాగంలోని మరుగుదొడ్లలో (రెస్ట్‌రూమ్‌లలో) కనిపించారని అనుటిన్ తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు అరగంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదం అనంతరం తీసిన ఫోటోల్లో కాలిపోయిన టేబుళ్లు, కుర్చీలు, పబ్ అంతర్గత భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు కనిపించింది.ఇలాంటి విషాదకర ఘటనలు థాయ్‌లాండ్‌లో గతంలో కూడా చోటుచేసుకున్నాయి. 2022లో దేశ తూర్పు ప్రాంతంలోని ఒక మ్యూజిక్ పబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది మరణించారు. అలాగే, 2009 జనవరి 1న నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బ్యాంకాక్‌లోని సాంటికా నైట్‌క్లబ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 66 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు. ఆ ప్రమాదం ఇండోర్ ఫైర్‌వర్క్స్ ప్రదర్శన కారణంగా సంభవించినట్లు అప్పట్లో భావించారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి....

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి:**జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం **(National Deworming Day)** సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన చిన్నారికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.సోమవారం కామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్బెండాజోల్ మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, కిశోరులకు సంవత్సరానికి రెండుసార్లు అల్బెండాజోల్ మాత్ర ఇవ్వడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన 2,46,177 మంది ప్రతి చిన్నారులకు , ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్ర అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్ర వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. జూలై 20న నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా మొదటి విడతలో మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు అందచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. జె.వెంకటి,ప్రోగామ్ అధికారి డాక్టర్.రోహిత్ కుమార్,కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, స్థానిక కౌన్సిలర్ అఖిల, జిల్లా విద్యాశాఖాధికారి మల్లికార్జున్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ చందన ప్రియ, ఎంఈఓ ఎల్లయ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వై. మాధవి, వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా స్వర్ణరథోత్సవం...

**శ్రీశైలం:**ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (13.07.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది.కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది.సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఏ.వి. రమణ, ఆలా అనిల్ కుమార్ ఆలయ విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి కె. వేంకటేశ్వరా రావు, అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వార్తాతరంగాలు



# జమ్మూకశ్మీర్ సీఎంపై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామంటూ నోటీసులు

రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిస్తూ జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు భారతీయ జనతా పార్టీ లీగల్ నోటీసు పంపింది. తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఒమర్ అబ్దుల్లా కొద్ది రోజుల క్రితం చేసిన ఆరోపణలే ఈ వివాదానికి కారణం కొద్ది రోజుల క్రితం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, 'మా పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలను బీజేపీ ప్రతినిధులు ప్రలోభపెట్టారు. రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు నగదు, మంత్రి పదవులు ఇస్తామని ఆశచూపారు. అలాగే తమ పార్టీలో జాయిన్ అయితే జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని చెప్పారు' అని ఆరోపించారు. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు



'ఆపరేషన్ లోటస్' తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు ఒమర్ అబ్దుల్లా ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు . తమపై చేసిన ఆరోపణలకు వెంటనే ఆధారాలు చూపాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత బీజేపీ తరఫున ఒమర్ అబ్దుల్లాకు అధికారిక లీగల్ నోటీసు పంపారు. ఆరోపణలను నిరూపించలేకపోతే లేదా బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రూ.100 కోట్ల పరువు నష్టం దావా దాఖలు చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.

# హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుడి అరెస్ట్

**హుజురాబాద్: జూలై 13:**హుజూరాబాద్ లోని మామిండ్లవాడకు చెందిన చింత సునీత(35) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి సోమవారం తెలిపారు. హత్య జరిగిన కేవలం 36 గంటల్లోనే ఈ కేసును చేయించినట్లు వివరించారు. సోమవారం హుజూరాబాద్ పోలీసు స్టేషన్ లో హత్య కేసు వివరాలను ఆమె వెల్లడించారు. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత (35) గత కొంతకాలంగా హుజూరాబాద్ మామిండ్లవాడలో నివాసం ఉంటుంది. ఆమె భర్త కుమార్ మృతి చెందగా, గత ఐదు సంవత్సరాలుగా మోతే కిరణ్ తో సహజీవనం చేస్తుంది. వీరిద్దరు మామిండ్లవాడ గ్యాస్ గోదాం సమీపంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సునీత తన పక్కన ఉన్న ఇంట్లో ముతోజు భాగ్య అనే మహిళతో స్నేహం పెంచుకుందన్నారు. తరచూ వీరిద్దరు కలిసి తిరుగుతుండటంతో సునీత వ్యభిచారం చేస్తుందనే అనుమానం కిరణ్ కలిగిందన్నారు. ఈ అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈ నెల 10న కిరణ్, సునీత ఇద్దరు కలిసి మద్యం సేవింవారన్నారు. ఇదే



విషయమై మళ్లీ గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన కిరణ్ ముందుగా సునీత గొంతును చేతులతో పిసికి, అనంతరం చిర ముక్కతో గొంతు బిగించి, కాలితో మెడపై తొక్కి హత్య చేశాడన్నారు. ఎవరికి తనపై అనుమానం రాకుండా ఉండేందుకు సునీత మృతదేహాన్ని ఎత్తుకొని వెళ్లి తన స్నేహితురాలైన ముతోజు భాగ్య ఇంటి సమీపంలోని బావిలో పడేశాడన్నారు. సునీత ధరించిన లో దుస్తులు (ప్యాంట్, డ్రాయర్) ను బావికి సమీపంలోని చెట్టు వద్ద పడవేసి, అక్కడి నుంచి పరారై కరీంనగరకు వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 13న సోమవారం హుజూరాబాద్ కు తిరిగి వచ్చాడనే పక్కా సమాచారం అందటంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, స్వచ్ఛందంగా నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు. సంఘటన జరిగిన ఇంటిని, మృతదేహాన్ని పడవేసిన బావిని, దుస్తులు పడవేసిన స్థలాన్ని చూపించాడన్నారు. సంఘటన స్థలం నుంచి పగిలిన గాజులు, గాజు ముక్కలు, పుస్తెల పూసలు, కాలి పట్టి తదితర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బావి సమీపంలో పడవేసిన మృతురాలి లో దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. మహిళ హత్య కేసును కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని పట్టుకున్నామన్నారు. సిఐ కరుణాకర్, ఎస్ఐ లు రవి, శ్రీనివాసరావు, సిబ్బంది మోహన్, అవినాష్, మహేందర్, శ్రీధర్, అనిల్ లను ఏసిపి అభినందించారు.

# ఆరుగురిని చంపిన రాజ్‌కుమార్ ఆత్మహత్య

**మృతదేహం రికవరీ చేసుకున్న పోలీసులు**

**హైదరాబాద్, జూలై 13:**షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన కేసు నిందితుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహాన్ని కొత్తూరు వద్ద రైల్వే పట్టాలపై స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో షాబాద్ దైవాలగూడలో పోక్సో కేసు పెట్టారని ఆరుగురిని హత్య చేశాడు రాజ్‌కుమారు. ఇది దేశ్యాప్తంగా అందర్నీ షాక్‌కి గురి చేస్తుంది. ఈ హత్యలు చేసిన తర్వాత తండ్రికి ఫోన్ చేసిన రాజ్‌కుమార్ తాను ఆత్మహత్య చేసుకుంటాని చెప్పాడు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హత్యలు జరిగిన రోజు నుంచి అతడి కోసం గాలిస్తున్నారు. అయితే మూడు రోజుల తర్వాత ఆరుగురిని హత్య చేసిన హంతకుడు రాజ్‌కుమార్ తన మేనమామ ఊరిలో చనిపోయి కనిపించాడు. కొత్తూరు మండలం పంజర్లలో వ్యక్తి డెడ్‌బాడి ఉందని సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి చూస్తే అతను రాజ్‌కుమార్ అని గుర్తించారు. అతని డెడ్‌బాడీ పక్కనే పాయిజన్ బాటిల్ కూడా ఉండటంతో ఆత్మహత్య చేసుకొని ఉంటాడని తేల్చారు. షాబాద్‌లో తనపై కేసు పెట్టిన బాలిక కుటుంబాన్ని, తన కుటుంబాన్ని అతి కిరాతకంగా శనివారం చంపేశాడు రాజ్‌కుమార్. తనపై పోక్సో కేసు పెట్టిన బాలిక ఇంటికి శుక్రవారం 11 గంటలకు వెళ్లాడు. తలుపు తీసిన వెంటనే బాలిక తల్లిని చంపేశాడు. తర్వాత బాలిక నాన్నమ్మ ప్రాణం తీశాడు. అనంతరం బాలికను బలవంతంగా తీసుకెళ్లిపోయాడు. అక్కడి నుంచి నేరుగా ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న దైవాలగూడకు చేరుకున్నాడు. అక్కడే చెరువుగట్టు వద్ద బాలికపై అత్యాచారం చేసి చంపేశాడు. అనంతరం తన ఇంటికి వెళ్లాడు. పిల్లల్ని చూపించాలని భార్యకు చెప్పి తలుపు తీసిన వెంటనే ఆమె



చంపేశాడు. పడుకొని ఉన్న తన పిల్లలు ఇద్దరి గొంతులు కోశాడు. తాగిన మైకంలో తనపై కేసు పెట్టిన వారిపై కక్షపూని రాత్రంతా మారణహోమానికి తెగబడ్డాడు

**రాజ్ కుమార్ మాములోడు కాదు**

షాబాద్‌లో ఆరుగురి హత్య కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విచ్చలవిడి జీవితానికి, జల్సాలకు అడ్డు వస్తుందనే కారణంతోనే నిందితుడు రాజ్ కుమార్ తన భార్య సరిత, ఇద్దరు పిల్లలను అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అతని వేధింపులు భరించలేక విడాకులు కావాలని అడగటమే ఈ దారుణానికి ప్రధాన కారణంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ హత్యల కోసం నిందితుడు ముందుగానే పక్కా ప్రణాళిక వేసుకున్నట్లు తెలుస్తోంది.పోలీసులు, కుటుంబసభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజ్ కుమార్ ఇంటర్ చదివే రోజుల్లో తనకంటే ఆరేళ్లు పెద్దదైన సరిత వద్దకు ట్యూషన్‌కు వెళ్లేవాడు. ఆ పరిచయంతో ఆమెను ప్రేమ పేరుతో వేధించడం మొదలుపెట్టాడు. ఈ విషయం తెలియడంతో సరిత తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూడటం ప్రారంభించారు. అయితే, రాజ్ కుమార్ ఆ సంబంధాలను చెడగొడుతూ వచ్చాడు. చివరికి 2018లో సరితను పెళ్లి చేసుకున్నాడు. డ్రైవర్‌గా పనిచేసే రాజ్ కుమార్ కాలక్రమేణా బెట్టింగులు, జూదం, మద్యం వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఏకంగా రూ.2 కోట్ల వరకు అప్పులు చేశాడు.అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్య చేసుకుంటానని తల్లిదండ్రులను బెదిరించి, కొంత పొలం అమ్మించి అప్పులు తీర్చాడు. ఆ తర్వాత కూడా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. మిగిలిన పొలాన్ని కూడా తల్లిదండ్రులను నమ్మించి అమ్మేసి ఆ డబ్బుతో జల్సాలు చేశాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య సరితను తీవ్రంగా వేధించేవాడు. అతని టార్చర్ భరించలేని ఆమె, విడాకులు ఇవ్వమని కోరింది. దీంతో తన విచ్చలవిడి జీవితానికి భార్య అడ్డుగా ఉందని భావించిన రాజ్ కుమార్, ఆమెపై తీవ్రమైన పగ పెంచుకున్నాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం శుక్రవారం రాత్రి భార్య సరిత, ఇద్దరు పిల్లలను దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేసి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.

# పాతబస్తీలో ఓట్ల గల్లంతు గండం

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణలోని ఓటర్లకు శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలు లేదా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేసింది. కర్ణాటక ప్రభుత్వం సకల సేవల చట్టం-2011 కింద జీవో నంబర్ **DPAR 191 SAKALA** 2011 ద్వారా ఇలాంటి నివాస పత్రాలను జారీ చేస్తోందని, అదే పంథాను ఇక్కడా అమలు చేసి పాతబస్తీ పేదలను ఆదుకోవాలని ఓవైసీ కోరుతున్నారుఎన్నికల సంఘం అధికారిక డేటాను పరిశీలిస్తే, హైదరాబాద్ జిల్లా పరిధిలో, ముఖ్యంగా పాతబస్తీ నియోజకవర్గాలైన చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా వంటి ప్రాంతాలలో ప్రతి ఎన్నికల్లోనూ అత్యంత తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సగటు ఓటింగ్ 45% నుండి 50% లోపే ఉంటుంది. పోలింగ్ రోజున ప్రజలు క్యూ లైన్లలో పెద్ద ఎత్తున నిలబడినట్లు కనిపించినప్పటికీ, తుది ఫలితాల్లో ఓటింగ్ శాతం సగం కూడా దాటకపోవడానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితాలోని అడ్డగోలు లోపాలే. ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి ఓట్లు, వలస వెళ్లిన వారి ఓట్లు అలాగే ఉండటంతో పోలింగ్ శాతం గణనీయంగా పడిపోతోంది.గతంలో బూత్ లెవెల్ అధికారులు కేవలం ఆధార్ కార్డ్ లేదా ఏదైనా ఒక సాధారణ గుర్తింపు పత్రాన్ని చూసి ఓటు నమోదు చేసేవారు. కానీ ఈసారి జరుగుతున్న స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ లో నిబంధనలను కఠినతరం చేశారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నా, ఉన్న ఓటును నిలబెట్టుకోవాలన్నా దశాబ్దాల నాటి మున్సిపల్ అసెస్‌మెంట్ రసీదులు, రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ లేదా పాత పౌరసత్వ ఆధారాలను చూపించాల్సి వస్తోంది. పాతబస్తీలో నివసించే మెజారిటీ ముస్లిం పేద కుటుంబాలు అద్దె ఇళ్లలోనో, లేదా ఎలాంటి లీగల్ డాక్యుమెంట్లు లేని పాత ఇళ్లలోనో తరతరాలుగా నివసిస్తున్నారు. ప్రస్తుత తనిఖీల్లో ఈ పత్రాలు చూపించలేకపోతుండటంతో, ఈ సారి ప్రక్షాళన ప్రక్రియ పూర్తయ్యే సరికి పాతబస్తీలో సగానికి పైగా ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోందిఈ ఓట్ల గల్లంతు భయం వెనుక ఎంఐఎం పార్టీ ఉనికికి సంబంధించిన పెద్ద రాజకీయ కోణం దాగి ఉంది. పాతబస్తీలో పోలింగ్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ నమోదైన బల్క్ ఓటింగ్ , లాయల్ ఓట్ బ్యాంక్ వల్లే ఎంఐఎం దశాబ్దాలుగా ఏకపక్ష విజయాలను సాధిస్తోంది. ఒకవేళ ఈ స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ వల్ల లక్షలాది మంది ఓట్లు తొలగిస్తే , ఎంఐఎం కోట బలహీనపడుతుంది. అంతేకాకుండా, భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికలలో పార్టీ సీట్ల సంఖ్య దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది. అందుకే ఓవైసీ దీనిని తీవ్రమైన సమస్య గా మలిచి, కర్ణాటక మోడల్ పీఆర్సీ కార్డును తెరపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై బ్లాక్‌మెయిల్ రాజకీయం నడుపుతున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి.ఈ పీఆర్సీ డిమాండ్‌పై సీఎం రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. తెలంగాణలో స్థానికత అనేది సెంటిమెంట్‌తో కూడిన అంశం. హడావుడిగా ఎంఐఎం అడిగినట్లు శాశ్వత నివాస పత్రాలు జారీ చేస్తే, అది రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారానికి దారి తీస్తుంది, పైగా బీజేపీ దీనిని పెద్ద ఎత్తున అందిపుచ్చుకుంటుంది. చట్టపరంగా ఓటర్ల జాబితా సవరణ అనేది పూర్తిగా కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఇందులో నేరుగా జోక్యం చేసుకోలేదు. ఒకవేళ ఓవైసీ ఒత్తిడికి లొంగి ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో నిబంధనలు సడలిస్తే అది లీగల్ వివాదాలకు దారితీస్తుంది. ఏది ఏమైనా, ఈ స్పెషల్ రివిజన్ ప్రక్రియ ముగిసే సరికి పాతబస్తీ రాజకీయ చిత్రపటంలో ఊహించని మార్పులు రావడం ఖాయంగా కనిపిస్తోంది

# వరుస పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు..

- మొదటి పేజీ తరువాయి

చేయాల్సిన వ్యవస్థ.. వారిని, వారి కుటుంబాలను అప్పులు, మానసిక ఒత్తిడి, నిరాశల వైపు నెడుతోందని ఆయన ఆరోపించారు. దేశంలో కొనసాగుతున్న అవినీతే పేపర్ లీక్ మాఫియాకు కారణమైందని రాహుల్ విమర్శించారు. పోటీ పరీక్షల కోసం సంవత్సరాల తరబడి కష్టపడిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ మాఫియా ఒక్కసారిగా నాశనం చేస్తోందని ధ్వజమెత్తారు. వీటన్నింటినీ చూస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌనం వహిస్తున్నారని విమర్శించారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికే ఈ అంశంపై కేంద్రం ముఖం చాటేస్తోందన్నారు. అలాగే దీనిని ప్రశ్నించాల్సిన మీడియా కూడా దీర్ఘకాలంగా మౌనంగా ఉందని ఎంపీ పేర్కొన్నారు.దేశ విద్యా రంగంలో విప్లవం అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జులై 17న డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరై విద్యార్థుల గొంతుకను మరింత బలంగా వినిపిద్దామని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఛాత్రోన్ కీ గూంజ్ రిజిస్ట్రేషన్‌కి సంబంధించిన లింక్‌ను ఎంపీ రాహుల్ గాంధీ తన పోస్టులో షేర్ చేశారు.

# ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం

- మొదటి పేజీ తరువాయి

అమ్మవారికళ్యాణం, 22 న రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది.ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు,ఆగస్టు 3న రంగం కార్యక్రమం ఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల తో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల కోసం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాన్స్‌కో, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, పౌర సరఫరాల శాఖ, టీజీఎస్ఆర్టీసీ, రైల్వే, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, పురావస్తు శాఖతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సులను నడిపిస్తున్నందున రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు

# 61 కోట్లు దాటిన డిజిటల్ పేమెంట్స్

- మొదటి పేజీ తరువాయి

అథెంటికేషన్ ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇది డిజిటల్ చెల్లింపుల రంగంలో మరింత వేగవంతమైన, సరళమైన మరియు సులువైన పద్ధతి వైపు మారుతున్న కాలానికి సంకేతంగా నిలుస్తోంది. ఈ ఫీచర్ వ్యక్తుల మధ్య జరిగే చెల్లింపులకు , అలాగే వ్యాపారులకు చేసే చెల్లింపులకు కూడా సపోర్ట్ చేస్తుంది. దీనివల్ల నిత్యం చేసే చెల్లింపులు మరింత వేగంగా, సులువుగా పూర్తవుతున్నాయి.ఈ బయోమెట్రిక్ అథెంటికేషన్ సదుపాయం రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ లావాదేవీలకు కూడా అందుబాటులో ఉంది. దీనివల్ల యూపీఐ పిన్ అవసరం లేకుండానే క్రెడిట్ కార్డ్ ద్వారా పేమెంట్లు చేయవచ్చు. సాధారణంగా సేవింగ్స్ ఖాతా నుండి యూపీఐ పేమెంట్ చేసేటప్పుడు ఉండే అదే వేగం, సౌకర్యాన్ని ఇది క్రెడిట్ కార్డ్ లావాదేవీలకు కూడా అందిస్తుంది."బయోమెట్రిక్ విధానానికి పెరుగుతున్న ఆదరణను చూస్తుంటే, యూపీఐ వినియోగదారులు సులభమైన, వేగవంతమైన పేమెంట్ అనుభవాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అర్థమవుతోంది. జూన్ నెలలోనే రికార్డు స్థాయిలో 60 కోట్లకు పైగా లావాదేవీలు నమోదు కావడం విశేషం. రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐతో సహా అన్ని రకాల చెల్లింపుల్లోనూ ఈ విధానానికి మంచి స్పందన వస్తోంది. ఇప్పటికే పలు బ్యాంకులు, యూపీఐ యాప్‌లు తమ కస్టమర్లకు బయోమెట్రిక్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. రాబోయే రోజుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ఈ పద్ధతిని ఎంచుకునే వారి సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నాము" అని ఎన్‌పీసీఐ గ్రోత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా అన్నారు.స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర లేదా ఫేస్ లాక్ వాడటం ద్వారా, వినియోగదారులకు యూపీఐ పిన్ గుర్తుపెట్టుకోవాల్సిన లేదా ఎంటర్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది లావాదేవీలను చాలా వేగంగా పూర్తి చేయడమే కాకుండా, పేమెంట్లు ఫెయిల్ అవ్వకుండా సక్సెస్ రేటును పెంచుతుంది.వివిధ బ్యాంకులు, యూపీఐ యాప్ లలో ఈ సదుపాయం విస్తరిస్తుండటంతో, భారతీయుల రోజువారీ చెల్లింపుల శైలిలో బయోమెట్రిక్ కీలక పాత్ర పోషించనుంది. రాబోయే నెలల్లో కూడా ఈ ఫీచర్‌కు ఆదరణ మరింత పెరుగుతుందని ఎన్‌పీసీఐ ఆశిస్తోంది. ఇది సురక్షితమైన, ఎలాంటి అడ్డంకులు లేని డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది

# 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన తెలంగాణ బీజేపీ..

- మొదటి పేజీ తరువాయి

వల్ల సింగరేణి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలం చేకూరుతుందని, దీంతో కార్మికుల్లో విశ్వాసం పెరిగిందని రాంచందర్ రావు పేర్కొన్నారు. యాత్ర ప్రారంభానికి ముందు మాట్లాడిన రాంచందర్ రావు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ఈ కారణంగానే ప్రభుత్వ రంగ సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం సింగరేణిని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బొగ్గు బ్లాక్‌లు వేలం ద్వారా కేటాయించాల్సి ఉన్నప్పటికీ, చట్టపరమైన అవకాశాలను పరిశీలించి, న్యాయ సలహా తీసుకున్న అనంతరం మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ట్రేడ్ యూనియన్ల విజ్ఞప్తి మేరకు తాను ప్రధానితో చర్చించి ఈ కేటాయింపును సాధించామని చెప్పారు.

# మెరిట్ ప్రకారమే గురుకుల సీట్లు

**ఆఫీస్ కు రావద్దు, మధ్యవర్తులను నమ్మవద్దు**

**తల్లిదండ్రులకు విజ్ఞప్తి**

**సీట్లు ఇప్పిస్తామని ఎవ్వరైనా ప్రలోభపెట్టితే ఫోన్ చేయండి**

**మధ్యవర్తులపై చర్యలు తీసుకుంటాం**

**- బిసీ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి**

**హైదరాబాద్:**రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సంస్థలో సీట్లు మెరిట్ ప్రకారమే కేటాయిస్తున్నామని, సీటు రానివారు ఆఫీస్, స్కూల్ చుట్టూ తిరగవద్దని సంస్థ కార్యదర్శి బడుగు సైదులు విజ్ఞప్తి చేశారు. 2026- 27 విద్యా సంవత్సరానికి మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు జరుగుతున్నాయని, అర్హత గల వారికే సీట్లు కేటాయిస్తామని ఆయన వివరించారు. మెరిట్ ప్రకారం మొదటి విడత, రెండవ విడత సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. 5వ తరగతిలో ,6,7,8 లో తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్లు ఇంకా ఏమైనా ఖాళీలు ఉంటే ఆన్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి విద్యార్థుల మెరిట్ ఆధారంగా అర్హులైన వారికి సీటు కేటాయించబడుతుందన్నారు. ఇంటర్ కాలేజి లో ఎక్కడైనా సీట్లు ఖాళీ గా ఉంటే ఆ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సీటు రాని వారు ఆఫీస్ , స్కూల్ చుట్టూ తిరగవద్దని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ ఏడాది గురుకులాల్లో సీట్లకు పోటీ పెరిగిందని, సీటు రానివారు హైదరాబాద్ హెడ్ ఆఫీస్ లో కానీ, =జూ ఆఫీస్ లలో కానీ, స్కూలు చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోవద్దు అని ఆయన సూచించారు. సీటు కోసం ఎవ్వరి నుంచి దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సంస్థ కార్యాలయానికి రావద్దని, అడ్మిషన్లకు దరఖాస్తులు తీసుకోబడవని, మధ్యవర్తులను నమ్మవద్దని సూచించారు. ఎవరైనా సీట్లు ఇప్పిస్తామని చెప్పితే వారి మాట నమ్మవద్దని, అలా చెప్పిన వారి వివరాలు ఫోన్ : 040-23120496 ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు. సీట్లు ఇప్పిస్తామని తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేసేవారి పై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుంటామని ఆయన హెచ్చరించారు.

వార్తాతరంగాలు
మంగళవారం 14 జూలై 2026

# శుభాంశు శుక్లాను యువత ఆదర్శంగా తీసుకోవాలి: సజ్జనార్



హైదరాబాద్, జూలై 13 : భారత వైమానిక దళానికి చెందిన గ్రూప్ కెప్టెన్, వ్యోమగామి శుభాంశు శుక్లాను దేశ యువత ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పిలుపునిచ్చారు. 41 ఏళ్ల విరామం తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన భారతీయుడిగా శుభాంశు శుక్లా చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కలామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శుభాంశు శుక్లా రచించిన 'ద సెకండ్ ఆర్బిట్' పుస్తకాన్ని సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడారు.

**శుభాంశు శుక్లా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు..**

మిషన్‌లో పైలట్‌గా పాల్గొని శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారని సీపీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. ఆయన రచించిన 'ద సెకండ్ ఆర్బిట్' పుస్తకంలో అంతరిక్ష యాత్రలో ఎదురైన అనుభవాలు, సవాళ్లను పొందుపరిచారని తెలిపారు. శుభాంశు శుక్లా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని సీపీ సజ్జనార్ ఆకాంక్షించారు.

**యువత కోసం ఈ పుస్తకాన్ని రచించాను: శుభాంశు శుక్లా**

అంతరిక్షం వరకు తన ప్రయాణం వెనుక ఉన్న అనుభవాలను దేశ ప్రజలకు, ముఖ్యంగా యువతకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు శుభాంశు శుక్లా తెలిపారు. హైదరాబాద్‌లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకుంటే ఎలాంటి లక్ష్యం అయినా సాధించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు శుభాంశు శుక్లా సమాధానాలు ఇచ్చారు. అంతరిక్ష యాత్రకు సంబంధించిన తన అనుభవాలను వారితో పంచుకున్నారు.

# కోస్తా..రక్తం తీస్తా అంటున్న రేవంత్ పై కేసులు నమోదు చేయాలి

**హరీష్ రావు**



హైదరాబాద్:నన్ను కోసినా పైసలు లేవు అంటున్నావు.. కానీ లక్ష కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తున్నావు, లక్ష కోట్లతో ఫ్యూచర్ సిటీ కడుతున్నావని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. నువ్వు మనవవాడితో పూరీలు చేసుకుంటే ప్రాబ్లెమ్ లేదు.. నీ ఫుట్బాల్ సోకుల కోసం వందల కోట్లు ఖర్చు పెడితే ప్రాబ్లెమ్. ఆ పైసల తోని 4 స్కూళ్లు, 4 కాలేజీలు కట్టొచ్చు.. కానీ ఫుట్బాల్ సోకుల కోసం ఖర్చు పెడితే తెలంగాణ ప్రజలు క్షమించరని అన్నారు.పక్క రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఫుల్ పేజీ యాడ్లు ఇస్తాడు, రైతుబంధు వేస్తే ఎకరానికి ఒక సభ పెడుతాడు.. ఇవ్వనీప్రభుత్వ పైసలే. ఖమ్మంలో రైతుబంధు కోసం సభ పెట్టి 3000 బస్సులు పెట్టాడు.. అంటే దాదాపు 100 కోట్లు పోయినట్లేగా . ఇన్ని చేస్తావు మళ్లీ నన్ను కోసిన పైసల్ లేవు అంటున్నావని అన్నారు.రేవంత్ రెడ్డి కోస్తా, రక్తం తీస్తా అని అంటుంటే డీజీపీ చెప్పిన ఖాకీ బుక్ ఏం చేస్తుంది? రేవంత్ రెడ్డిని కోస్తామని మనం అంటే పోలీసులు ఊరుకుంటారా? కేసులు పెడతారు కదా. హింసను ప్రేరేపిస్తే, క్రిమినల్ మాటలు మాట్లాడితే కేసులు నమోదు చేయాలి కదా.. మరి పోలీసుల కళ్ళు మూసుకుపోయాయా అని ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి సన్నిహితుడు, ఓ మార్కెట్ కమిటీ చైర్మన్ రూ.20 లక్షలు లంచం తీసుకొని పోక్సో, ఆరు హత్యల నిందితుడు రాజ్ కుమార్ అరెస్ట్ కాకుండా కాపాడాడు. పోలీసులు అరెస్ట్ చేయకుండా 45 రోజులు టైమ్ ఇస్తే, నిందితుడు కోర్టుకు పోయి బెయిల్ తెచ్చుకొని ఆరుగురిని హత్య చేశాడు. ఏపీలో వైసీపీ స్పోక్స్పర్సన్ నాగార్జున యాదవ్.. రేవంత్ రెడ్డి పెయింట్ వేస్తాడు అంటే ఆయనను అరెస్ట్ చేశారు. నల్లబాలు ట్విట్టర్లో ట్వీట్ చేస్తే అరెస్ట్ చేశారు. కానీ రేప్ చేసిన నిందితుడు రాజ్ కుమార్ను అరెస్ట్ చేయకుండా, వాడితో కూర్చొని పోలీసులు మందు తాగినారని అయన ఆరోపించారు.

# ఎస్ఐఆర్ ను 6 నెలలు పొడిగించాలి...

**మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



బి ఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ఎమ్మెల్యే తలసాని కి పలువురు ఓటర్లు ఫిర్యాదులు చేసారు. ఎన్యుమరేటర్ ఫారం పిలప్ చేసే విషయంలో బీఎల్వో లకే సరైన అవగాహన లేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.సిబ్బంది సరిపడా లేరు... సిబ్బందిని పెంచాలని అధికారుల వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేసారు. 2002 ఓటరు జాబితా బీఎల్వో ల వద్ద కూడా లేవు. 2002 లో ఉన్న నియోజకవర్గాలు.. ప్రస్తుత నియోజకవర్గాలు మారాయి. ఎన్యుమరేటర్ ఫారం పిలప్ చేసే విషయంలో అంతా గందరగోళం ఉంది. ఈ నెల 24 తో ఎస్ఐఆర్ కార్యక్రమం గడువు ముగుస్తుంది. ఇప్పటి వరకు 10 శాతం కూడా పూర్తి కాలేదు...11 రోజులలో 100 శాతం ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు.

# సీఎం నివాసాన్ని ముట్టడించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

**హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్రం లో ప్రైవేట్ కార్పోరేట్ స్కూల్లో ఫీజుల నియంత్రించాలని ఆప్ నేతలు డిమాండ్ చేసారు. సోమవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించడానికి ప్రయత్నించారు. , ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని , విద్యా శాఖకు మంత్రిని కేటాయించాలని , వివిధ విద్యారంగ సమస్యల ను పరిష్కరించాలని అందళనకారులు డిమాండ్ చేసారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులు, తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కార్యవర్గ నాయకులు అందరూ ముఖ్యమంత్రి నివాసం దగ్గరికి చేరుకోగా కాసేపు ఆమ్ ఆద్మీ పార్టీ **(AAP )** నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి మధురానగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు

## మేడిగడ్డపై చర్చకు సిద్ధమా?

# మంత్రి ఉత్తమ్‌కు జగదీశ్ రెడ్డి సవాల్

**తెలంగాణలోని కాంగ్రెస్ ఒక 'హైబ్రిడ్ కాంగ్రెస్' అని జగదీశ్ రెడ్డి విమర్శ**

**కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దిగజారిందని ఆరోపణ**

**మేడిగడ్డపై సూచనలిచ్చిన ఇంజనీర్లను సీఎం బెదిరించారని ఫైర్**

**రాష్ట్రంలో నేరాలు 50 శాతం పెరిగాయన్న జగదీశ్ రెడ్డి**



తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి బీజేపీ ఏ విధంగా అన్యాయం చేస్తోందో, కాంగ్రెస్ సైతం అదే బాటలో పయనిస్తోందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని ఆయన 'హైబ్రిడ్ కాంగ్రెస్'గా అభివర్ణించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని జగదీష్ రెడ్డి ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించి, రాష్ట్రాన్ని ధాన్య ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. కానీ, నేడు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులపై సూచనలు చేసిన రిటైర్డ్ ఇంజనీర్లను జైల్లో పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెదిరించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. నీటి నిల్వలపై అవగాహన లేకుండా వ్యవహరిస్తే భద్రాచలం వంటి ప్రాంతాలకు వరద ముప్పు తప్పదని హెచ్చరించారు. ఈ అంశంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చకు సిద్ధంగా ఉన్నారా? అని జగదీష్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో నేరాలు 50 శాతం పెరిగాయని, ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీలో చర్చించే ధైర్యం అధికార పార్టీకి లేదని విమర్శించారు. ఇంజనీర్లపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల పట్ల డీజీపీ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎస్ఐఆర్ సర్వే విజయవంతానికి

# అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి..



**మంచిర్యాల :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రజాప్రతినిధులు ప్రజలు సమన్వయంతో సహకరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కోరారు సోమవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐఆర్ సర్వేపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా విడుదల చేసిన అవగాహన పోస్టర్లలో మీ ఓటు మీ బాధ్యత అనే నినాదంతో కొత్త ఓటరు నమోదు పేరు తొలగింపు వివరాల సవరణ పోలింగ్ కేంద్రం మార్పు డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ జూలై 24తో ముగుస్తుందని ఓటరు జాబితాలో పేరు లేని వారు కొత్తగా ఓటరు నమోదు చేసుకునే అర్హులు అలాగే పేరు చిరునామా ఇంటి నంబర్ వయస్సు ఫోటో తదితర వివరాల్లో మార్పులు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్పు ఓట్ల తొలగింపు వంటి ప్రక్రియలను కూడా ఈ సర్వే ద్వారా పూర్తి చేసుకోవచ్చని ఎమ్మెల్యే వివరించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అందువల్ల ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అవుతుందని అనంతరం అభ్యంతరాలు సవరణలకు ఆగస్టు నుంచి అక్టోబర్ 24 వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 31న విడుదల కానుందని వెల్లడించారు ఈ సర్వే ప్రక్రియ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్న ఎమ్మెల్య రేషన్ కార్డులు పెన్షన్లు తదితర ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలను కూడా ప్రజలు సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సర్పంచులు వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.ఎస్ఐఆర్ సర్వే పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని రాజకీయాలకు అతీతంగా ప్రజాహిత దృక్పథంతో సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు

## షాబాద్ హత్యల కేసు.. రాజ్‌కుమార్

# కిరాతకంపై విస్తుపోయే నిజాలు!

**షాబాద్ ఆరు హత్యల కేసులో వెలుగులోకి సంచలన విషయాలు**

**విడాకులు కోరిన భార్య, పిల్లలను హత్య చేసిన రాజ్ కుమార్**

**జూదం, బెట్టింగులకు బానిసై రూ.2 కోట్ల అప్పులు**

**విచ్చలవిడి జీవితానికి అడ్డువస్తుందనే దారుణానికి పాల్పడ్డ నిందితుడు**



షాబాద్‌లో ఆరుగురి హత్య కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విచ్చలవిడి జీవితానికి, జల్సాలకు అడ్డు వస్తుందనే కారణంతోనే నిందితుడు రాజ్ కుమార్ తన భార్య సరిత, ఇద్దరు పిల్లలను అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అతని వేధింపులు భరించలేక విడాకులు కావాలని అడగటమే ఈ దారుణానికి ప్రధాన కారణంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ హత్యల కోసం నిందితుడు ముందుగానే పక్కా ప్రణాళిక వేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు, కుటుంబసభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజ్ కుమార్ ఇంటర్ చదివే రోజుల్లో తనకంటే ఆరేళ్లు పెద్దదైన సరిత వద్దకు ట్యూషన్‌కు వెళ్లేవాడు. ఆ పరిచయంతో ఆమెను ప్రేమ పేరుతో వేధించడం మొదలుపెట్టాడు. ఈ విషయం తెలియడంతో సరిత తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూడటం ప్రారంభించారు. అయితే, రాజ్ కుమార్ ఆ సంబంధాలను చెడగొడుతూ వచ్చాడు. చివరికి 2018లో సరితను పెళ్లి చేసుకున్నాడు. డ్రైవర్‌గా పనిచేసే రాజ్ కుమార్ కాలక్రమేణా బెట్టింగులు, జూదం, మద్యం వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో ఏకంగా రూ.2 కోట్ల వరకు అప్పులు చేశాడు. అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్య చేసుకుంటానని తల్లిదండ్రులను బెదిరించి, కొంత పొలం అమ్మించి అప్పులు తీర్చాడు. ఆ తర్వాత కూడా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. మిగిలిన పొలాన్ని కూడా తల్లిదండ్రులను నమ్మించి అమ్మేసి ఆ డబ్బుతో జల్సాలు చేశాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య సరితను తీవ్రంగా వేధించేవాడు. అతని టార్చర్ భరించలేని ఆమె, విడాకులు ఇవ్వమని కోరింది. దీంతో తన విచ్చలవిడి జీవితానికి భార్య అడ్డుగా ఉందని భావించిన రాజ్ కుమార్, ఆమెపై తీవ్రమైన పగ పెంచుకున్నాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం శుక్రవారం రాత్రి భార్య సరిత, ఇద్దరు పిల్లలను దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేసి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.

# రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు..

**వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్**

**హైదరాబాద్, జూలై 13:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వైసీపీ నేతను చిక్కుల్లో పడేశాయి. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే పోలీసులు ఆయనను నివాసం నుండి తీసుకువెళ్లారని కుటుంబసభ్యులు చెబుతున్నారు. తాము తెలంగాణ పోలీసులమంటూ నాగార్జున యాదవ్ కుటుంబ సభ్యులకు తెలిపిన సిబ్బంది, నాగార్జున యాదవ్ అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు అందిస్తామని చెప్పారు. అయితే ముందస్తు సమాచారం లేకుండా జరిగిన అరెస్టుతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నాగార్జున యాదవ్ ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ఈ అరెస్టుకు కారణమని తెలుస్తోంది. ఒక టీవీ ఛానెల్ నిర్వహించిన లైవ్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన.. రేవంత్ రెడ్డిపై తీవ్ర పదజాలంతో రెచ్చిపోయారు. సీఎం పదవిలో ఉన్న రేవంత్ రెడ్డిని అత్యంత చులకనగా చేసి మాట్లాడుతూ.. ఒక 'జొమాటో, స్విగ్గీ డెలివరీ బాయ్'తో పోల్చారు. రేవంత్ డెలివరీ బాయ్ అని, ఆయనకు ఒక ప్రభుత్వ జీవో (+రూ) చదవడం కూడా రాదని, కనీసం ఎమ్మెల్యేగా గెలవడానికి కూడా పనికిరాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏకవచనంతో సంబోధిస్తూ రేవంత్‌ను తీవ్రంగా దూషించారు. న్యూస్ ప్రజెంటర్ అలాంటి మాటలు కరెక్ట్ కాదని, రాజకీయంగా విమర్శలు చేయడం వరకు పరవాలేదన్నారు. అయినా వెనక్కి తగ్గకుండా నాగార్జున యాదవ్ టీవీ డిబేట్‌లో రెచ్చిపోయారు. అంతటితో ఆగకుండా తాను రేవంత్ రెడ్డిని, స్విగ్గీ, జొమాటో డెలివరీ బాయ్స్‌తో పోల్చడం.. డెలివరీ బాయ్స్‌ను అవమానించడం అవుతుందంటూ వారికి సారీ కూడా చెప్పారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాలలో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్టుపై సోషల్ మీడియాలో భిన్నమైన చర్చ నడుస్తోంది. ఒక రాష్ట్ర సీఎంను ఈ విధంగా కించపరచడం తగదని కొందరు నెటిజన్లు సూచించారు. అయితే గతంలో వైఎస్ జగన్‌పై జరిగిన విమర్శలను, కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి చేసిన పాత వ్యాఖ్యలను మరికొందరు నెటిజన్లు గుర్తుచేస్తున్నారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తులను రేవంత్ కూడా గౌరవం ఇవ్వలేదని, తీవ్ర పదజాలం వాడతారని కొందరు నెటిజన్లు ఘాటుగా స్పందిస్తున్నారు. ఏదేమైనా, ఇటీవల కాలంలో నేతల మధ్య రాజకీయ విమర్శలకు బదులుగా వ్యక్తిగత దూషణలు హద్దులు మీరుతున్నాయని ప్రజలు సైతం గమనిస్తూనే ఉన్నారు. వాక్ స్వాతంత్ర్యం పేరుతో సీఎంపై తీవ్ర వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం, దూషించడం ప్రజాస్వామ్యానికే ముప్పు అని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# బాల్యంపై భారం ...

**పుస్తకాల బరువుతో వంగిపోతున్న చిన్నారులు**

**చిన్న వయస్సులో వెన్నెముకపై సామర్థ్యాన్ని మించి భారం**

**అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం**

**జగిత్యాల:** బాల్యంపై భారం పెరిగిపోతోంది. వారిని పుస్తకాల బరువు కుంగదీస్తోంది. కిలోల కొద్ది బరువును వీపుపై మోస్తూ అనారోగ్యం భారిన పడాల్సి వస్తోంది. పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి. విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అవసరంలేని, అర్హతకు మించిన పుస్తకాలను కొనుగోలు చేయించి విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వాస్తవానికి నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని చట్టం పేర్కొంటుంది. కానీ ఈ నిబంధనలేవి అమలవడం లేదు. అంతేనా పలు ప్రైవేటు పాఠశాలలు పుణ్యమా అని ఒకటి రెండు తరగతుల విద్యార్థులే 30 నుంచి 45 పుస్తకాలను మోస్తున్నారు. విద్యార్థులకు తరగతి గదులే సరిపడా లేని పలు పాఠశాలల్లో ఇక లాకర్ల సదుపాయం ఎక్కడ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. కానీ ఇలాంటి పాఠశాలలను అధికారులు పట్టించుకోవడంలే దని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలను అనుసరించి విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేసుకుంటున్నారు. ఇలా వేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ ఏడాది అకాడమిక్ క్యాలెండర్ ను విడుదల చేసిన ప్రభుత్వం పది బ్యాగ్ లెస్ డేస్ ను నిర్వహించాలని, నెలలో ప్రతీ మూడో శనివారం నో బ్యాగ్ డేగా పాటించాలని నిర్ణయం తీసుకుంది.

# బీజేపీ నేత ఇంట్లో పాకిస్థాన్ జాతీయులు..ఉద్రిక్తత

**రంగారెడ్డి:**పాకిస్తానీ ఐఎస్ ఏజెంట్ల నుండి బిజెపి నేత అందెల శ్రీరాములు యాదవ్ కు ప్రమాదం ఉందని అనుమానాలు పార్టీ నేతలలో కలుగుతోంది. తాజాగా మల్లాపూర్ లోని బిజెపి నేత అందెల శ్రీరాములు యాదవ్ నివాస సమీపంలో పాకిస్తానీ జాతీయలను పోలీసులు గుర్తించారు. విషయం తెలియగానే అక్కడికి పెద్ద ఎత్తున చేరుకునే ప్రయత్నం చేస్తున్న బిజెపి నేతలను, అందెల శ్రీరాములు యాదవ్ ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో పోలీసుఉ భారీగా మోహరించారు.

# శివాలయాలకు భక్తుల తాకిడి

**హైదరాబాద్:** మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం ఒకేరోజు రావడంతో తెలుగు రాష్ట్రాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలానికి రద్దీ భారీగా పెరిగింది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పాతాళగంగలో స్నానాలు ఆచరించి, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్నారు. దీంతో అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. వేములవాడ రాజన్న ఆలయంలోనూ భక్తుల రద్దీ పెరిగింది.

# 22 కిలోమీటర్ల బైక్ ర్యాలీ ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

## 237 కోట్లతో సింగారం టు మక్తల్ నాలుగు లైన్ల రహదారి పనులు ప్రారంభం.

**ఉట్కూర్ జులై 13 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని. సింగారం చౌరస్తా నుంచి మక్తల్ వరకు రూ. 237 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని రాష్ట్ర పాడి పరిశ్రమల. యువజన క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జిల్లాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రధానత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఉట్కూరు మండల్ లో బైక్ ర్యాలీ నిర్వహించిన మంత్రి. త్రిప్రాస్ పల్లి గ్రామ శివారులో ఉన్న శరభ లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నా అనంతరం. మంత్రిగారు తిప్రాస్ పల్లి నుంచి ఉట్కూరు మీదుగా మక్తల్ వరకు సుమారు 22 కిలోమీటర్ల మేర నిర్వహించిన బైక్ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మక్తల్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమార వేసి నివాళు లర్పించారు. సింగారం టు మక్తల్ నాలుగు లైన్ల రహదారి పూర్తయితే రవణ సౌకర్యాలు మెరుగుపరడంతో పాటు వ్యాపార వాణిజ్య రంగాలకు రవాణా సౌకర్యం లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నారాయణపేట జిల్లాకు అవసరమైన నిధులు తీసుకొచ్చి మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి అన్నారు. ప్రజల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్కూర్ మండల అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రెడ్డి. పట్టణ అధ్యక్షుడు కొక్కు లింగం. మండల యువజన అధ్యక్షుడు కోరం మహేశ్వర్ రెడ్డి. కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి. మాజీ ఎంపీటీసీ శివరామరాజు. టౌన్ మైనారిటీ అధ్యక్షుడు జలాల్. వార్డ్ మెంబర్ కొక్కు మల్లేష్. కొక్కు శంకర్. ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఈనెల 15 న కొత్తకోట పట్టణానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


### ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, కొత్తకోట జులై 13 (స్కై న్యూస్);** ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రారంభించేందుకు ఈ నెల 15వ తేదీ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోట పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులతో కలిసి పాఠశాల భవనాన్ని, జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అనంతరం హెలి ప్యాడ్ ను పరిశీలించిన దేవరకద్ర ఎమ్మెల్య జి. మధుసూదన్ రెడ్డి. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తో కలిసి విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తూ, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి విద్యా శాఖను తన వద్దనే పెట్టుకుని, గత ప్రభుత్వంలో విధ్వంసమైన విద్యా శాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తూ, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగింది అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏ ఐ) పరిజ్ఞానాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని, ఏఐ కోర్సులు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమెజాన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది అన్నారు. సాంకేతిక నైపుణ్యాలు అలవడేలా డిజిటల్ లెర్నింగ్, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు అన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశారు అన్నారు. మన నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నెక్స్ట్ అకాడమిక్ ఇయర్ కల్లా స్కూల్ నిర్మాణం పూర్తయి, క్లాసెస్ ప్రారంభమవుతాయి తెలిపారు. గత ప్రభుత్వం విద్యాశాఖనుపట్టించుకోలేదు, గత ప్రభుత్వంలో ఎన్నో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి అన్నారు. కొత్తకోట పట్టణంలో బాలికల పాఠశాల ఎంతో అద్వాన పరిస్థితిల్లో ఉండేది, కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉండేవి, అవి కూడా పెచ్చులు వుడుతుండి చెట్ల కింద విద్యార్థులు చదువుకునే పరిస్థితులు ఉండేవి అన్నారు. మూత్రశాలలు సైతం లేవు అన్నారు. ఆ పరిస్థితులు చూసి, ఆనాడు స్కూల్ నిర్మిస్తామని మాటిచ్చాం అన్నారు. ఇచ్చిన మాట మేరకు సి ఎస్ ఆర్ నిధులు, కొందరి దాతల సహకారంతో గర్ల్స్ హై స్కూల్ భవనాన్ని నిర్మించాం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాలనుప్రారంభించుకోబోతున్నాం అన్నారు. స్కూల్ కు సంబంధించిన చిన్న కార్యక్రమానికి ఆహ్వానమిస్తే, ఆహ్వానానికి స్పందించి వెంటనే ముఖ్యమంత్రి విచ్చేస్తున్నారంటే, ముఖ్యమంత్రి విద్యాకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ఎల్లుండి బుధవారం 15వ తారీఖున ముఖ్యమంత్రి ఉదయం 11:30 అమర్ రాజా రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్నారు. అక్కడి నుండి బై రోడ్డు ద్వారా కొత్తకొట కు మధ్యాహ్నం 1:30 గంటలకు చేరుకుని, బాలికల పాఠశాల ను ప్రారంభిస్తారు అన్నారు. ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా, పాఠశాల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ముఖ్యమంత్రి గారు మమేకమవుతారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## రామకృష్ణ సేవా మందిరంలో ఉచిత హోమియో వైద్య శిబిరం



**హనుమకొండ జులై 13;**శ్రీ రామకృష్ణ సేవా మందిర్, కెఎల్ఎన్ రెడ్డి కాలనీ (80'–0 రోడ్) హనుమకొండ" యందు "ఓరుగల్లు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ డ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిక్స్" డాక్టర్లు పావుశెట్టి శ్రీధర్, కమల్ కిషోర్, సాయికృష్ణ, శ్రీకాంత్ పర్యవేక్షణలో "ఉచిత హోమియో వైద్య శిబిరం" జరిగింది. దాదాపు 35 మంది పేషెంట్స్ అట్టి సౌకర్యాన్ని పొందారు. సేవా సమితి పక్షాన అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి, సభ్యులు, శ్రీలక్ష్మి, లక్ష్మమ్మ, చిత్ర సరోజన యువ విభాగ్ సభ్యుడు నరేష్ సదరు సేవలో పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి జన్మదిన వేడుకలు



**జోగులాంబ గద్వాల, జూలై 13 (స్కై న్యూస్):** గద్వాల నియోజకవర్గంలోని గద్వాల్ మండలం పూడూరు గ్రామం నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సమాక్షంలో ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా గ్రామ సర్పంచ్ బుజ్జన్న, బి కే ఎన్ ఆర్ యువసేన సభ్యుడు పూడూర్ పాండు ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ, కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా తో ఘనంగా సత్కరించారు. పాఠశాలలు చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ యువ నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు పూడూరు శ్యామ్,కేశవరెడ్డి, నరేందర్ రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీనివాసులు గోపాల్ రెడ్డి రంగయ్య గౌడ్ తిరుమల్ రెడ్డి రఫీ రంగారెడ్డి భాను ప్రకాష్ అశోక్ నాయకులు కార్యకర్తలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేయాలి

## హెల్త్ కార్డులు అమలు కావడం లేదు




**జోగులాంబ గద్వాల, జూలై 13(స్కై న్యూస్):**జర్నలిస్టులకు జారీ చేసిన హెల్త్ కార్డులు నిమ్స్ ఆస్పత్రి మినహా ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు కావడం లేదని నాయకులు గద్వాల టీ డబ్ల్యూ జె ఎఫ్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అన్ని గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు అమలు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు, జర్నలిస్టులందరికీ నూతన హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

**ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఇప్పటికీ తుది నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదని విమర్శించారు. జర్నలిస్టులకు ఆశలు చూపి, తర్వాత ఆ ఆశలపై నీళ్లు చల్లే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. వెంటనే ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు.

**అక్రిడిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి**

అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ఆలస్యం అవుతోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులు లేక బస్ పాస్‌లు పొందడంలో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**పెన్షన్, ఫీజు రాయితీపై డిమాండ్**

జర్నలిస్టులకు నెలకు రూ.10 వేల పెన్షన్ మంజూరు చేయాలని, అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణింపు

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జోగులాంబ గద్వాల, జూలై 13 (స్కై న్యూస్):**ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు చదువులో రాణిస్తారని, ఫలితంగా ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని గద్వాలలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి సాధన చేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. నులిపురుగుల నివారణకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల చిన్నారులతో పాటు విద్యాసంస్థల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థినిలు న్యూట్రీషన్ సమస్యలు లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలతో రక్తహీనతను నివారించవచ్చన్నారు.




నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు అనంతరం కలెక్టర్ పలువురు విద్యార్థులకు మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఇతర వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాస శివరాత్రి పూజలు



**జోగులాంబ గద్వాల, జూలై 13(స్కై న్యూస్):**ఆదిశిల క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో శ్రీ శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా అభిషేకాలు లింగార్చనలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహాశివరాత్రి పర్వదినం లాంటి మాస శివరాత్రి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివార్చనలు బిల్వాష్టకంతో లింగార్చనలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సోమవారం చతుర్ధశి మహాశివరాత్రి 'మహాశైవాక్షయోగం' జేష్ఠ మాసంలో మహాశివరాత్రి 100 సంవత్సరాలకు ఒకసారి నక్షత్రం,వారం,తిథి, ఈ మూడు రావడం 100 సంవత్సరాలకు ఒకసారి రావడం జరుగుతుంది. కనుక శివాలయంలో క్షేత్రపాలుకుడైన మహా శివునికి రుద్రాభిషేకము మరియు ప్రత్యేక పూజలు చేయడం వలన సకల పాపాలు తొలగి, సుఖ సంతోషాలు చేకూరుతాయని పురోహితులు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ విద్యారంగాని మెరుగు పరచాలి...

### అమరచింతకీ జూనియర్ కాలేజీని కేటాయించాలి

### మంత్రి హామీ నిలబెట్టుకోవాలి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్ ఎం రమేష్




**దేవరకద్ర, అమరచింత జూలై 13 (స్కై న్యూస్);** వనపర్తి జిల్లా అమరచింత మండల్ చంద్రప్ప తండా ప్రాథమిక పాఠశాలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రాథమిక పాఠశాలలను సందర్శించి సర్వే చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్ ఎన్ రమేష్, మండల్ కమిటీ సభ్యులు రవి నాయక్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె రాఘవ మాట్లాడుతూ గతంలో 60మంది విద్యార్థులు ఉన్న పాఠశాల ఈ రోజు 10మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారన్నారు. అంటే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల ఎంత నిబద్ధత ఉందో స్పష్టంగా కనబడుతుందని ఏదేవా చేశారు. ప్రాథమిక పాఠశాలకి అదనపు గదులు లేక ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒకే గదిలో చదువులు కొనసాగించడం జరుగుతుంది. వెంటనే జిల్లా కలెక్టర్ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి స్పందించి గిరిజన విద్యార్థులని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న ఇద్దరు టీచర్లని కొనసాగించాలని కోరారు. అమరచింత మండలానికి జూనియర్ కాలేజీని మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ ప్రారంభం కాలేదు. ఈ విద్యా సంవత్సరం జూనియర్ కాలేజ్ ని ప్రారంభిస్తామని చెప్పిన అకాడమిక్ ఇయర్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా జూనియర్ కాలేజీ ఆనవాళ్లు ఎక్కడ కనబడడం లేదని వెంటనే మంత్రివర్యులు వాకిటి శ్రీహరి జూనియర్ కాలేజ్ ని అమరచింత మున్సిపాలిటీకి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు వెంకటేష్ నాయక్,సూర్య నాయక్, శ్రీను నాయక్, కే ,వెంకటేష్, బి, తిరుమలేష్, ఎస్ఎఫ్ ఐ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమా రాణి మృతికి ప్రగాఢ సంతాపం..

### కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి జిల్లా రామగుండం జూలై 13(స్కై న్యూస్)** ఈ రోజు రామగుండం మజీద్ టర్నింగ్ లో రామగుండం ఎమ్మెల్యే శ్రీ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారి సోదరుడు ధర్మేందర్ సింగ్ గారి సతీమణి శ్రీమతి ఉమా రాణి మృతి చెందాగా సోమవారం కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తుది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కుటుంబ సభ్యులతో కలిసి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతిపట్ల పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## ధరూర్‌లో రూ.339.39 కోట్లతో 126 కి.మీ రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జోగులాంబ గద్వాల, జూలై 13 (స్కై న్యూస్):ధరూర్: రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కలిసి ధరూర్ మండల కేంద్రంలో రూ.339.39 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 126 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో వారు పాల్గొని రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేకల, గొర్రెల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
మంగళవారం 14 జూలై 2026

# ప్రభుత్వం వెంటనే ఏకీకృత సర్వీసు రూల్ రూపొందించాలి

**పి ఆర్ టి యు టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ నర్సింగరావు**



**నారాయణపేట జూలై 13: (స్కైన్యూస్)** ప్రభుత్వం ఉపాధ్యాయులు ఏకీకృత సర్వీస్ రూల్ రూపొందించాలని పి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్ రావు కోరారు.సోమవారం పి ఆర్ టి యు టి ఎస్ నారాయణపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మార్కెట్ లైన్ లో పిఆర్టియుటిఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంను పట్టణ శాఖ అధ్యక్షురాలు వాణిశ్రీ,ప్రధాన కార్యదర్శి జహీరోద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నరాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు మాట్లాడుతూ వెంటనే ఏకీకృత సర్వీస్ రూల్స్ ను రూపొందించి మండల విద్యాధికారులను, లెక్చరర్ పోస్టులను డిప్యూటీఈ వో పోస్టులను ప్రమోషన్ల ద్వారా నింపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పిఆర్టియు సంఘము అన్ని యాజమా న్యాల ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని త్వరలోనే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించబడతాయని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. పి ఆర్టీయు సంఘం ఉపాధ్యాయులకు ఎ చిన్న కష్టం వచ్చినా కుటుంబం లాగా ఆదుకుంటుందని అన్నారు.ప్రభుత్వము తమ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమును రద్దుచేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. సిపిఎస్ రద్దు కోసం జరిగే అన్ని పోరాటాలకు పి ఆర్టీయూ సంఘం బేసరత్తుగా మద్దతిస్తుందని ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నారు. మూడు సంవత్సరాలగా పెండింగ్లో పెట్టిన పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్తో పిఆర్సిని అమలు చేయాలని లేని పక్షంలో ఉద్యమ బాట పట్టడానికి సంఘం సిద్ధంగా ఉందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి మండల అధ్యక్షులుఎం.రఘువీర్ ప్రధాన కార్యదర్శి ఎం. జనార్ధన్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె.శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ హనీఫ్, జయంత్, సునీత పాఠశాలల ఉపాధ్యాయ బృందం వినోద్ కళ్యాణి బసవరాజ్ శశికళ పర్వీన్ అబ్దుల్ హాక్ శ్రీనివాస్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై అసత్య ప్రచారం మానుకోవాలి..

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్**



**రంగారెడ్డి జిల్లా, జూలై 13 (స్కై న్యూస్):** షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల చేసిన అభివృద్ధిపై వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీల ఏర్పాటు ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేయడంతో పాటు దశలవారీగా కలెక్టరేట్ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య కళాశాలలు, గ్రామపంచాయతీ భవనాలు, బీటీ, సీసీ రోడ్లు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిందని తెలిపారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడా ఆగలేదని ఆయన పేర్కొన్నారు. షాద్నగర్ నియోజకవర్గంలోని నందిగామ, జిల్లేడు చౌదరిగూడెం మండలాలు ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలే ప్రత్యక్షంగా చూశారని చెప్పారు. మండల కేంద్రాల్లో సీసీ రోడ్లు, గ్రామాలకు బీటీ రోడ్లు, కొత్తూర్--షాద్నగర్ రహదారి అభివృద్ధి వంటి అనేక పనులు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. “కాగితాలు మాత్రమే తీసుకొచ్చారు, పనులు చేయలేదు” అనే ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని అంజయ్య యాదవ్ అన్నారు. కాగితాల గురించి మాట్లాడే ముందు గ్రామాల్లోకి వెళ్లి జరిగిన అభివృద్ధిని పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం రెండు బీటీ రోడ్లు నిర్మించి మొత్తం అభివృద్ధి తమ ప్రభుత్వమే చేసిందని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను పూర్తిగా విస్మరించి, ఇప్పుడే అన్నీ జరుగుతున్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. 2014కు ముందు పరిస్థితులు, అనంతరం జరిగిన అభివృద్ధిని ప్రజలే గుర్తించి చెబుతారని పేర్కొంటూ, గతంలో జరిగిన పనులను పూర్తిగా కాదనడం ప్రజల విజ్ఞతను అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.

# చేనేత సహకార సంఘం ఎలక్షన్లలో గెలిచిన అభ్యర్థులకు ఘనంగా సన్మానిస్తున్న రాష్ట్ర బిజెపి నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



**దేవరకద్ర అమరచింత జూలై 13 (స్కై న్యూస్);** చేనేత సహకార సంఘం ఎలక్షన్లో భారతీయ జనతా పార్టీ బలపరిచి, గెలిచిన అభ్యర్థులకు ఘనంగా సన్మానిస్తున్న రాష్ట్ర బిజెపి నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, అమరచింత చేనేత కార్మికుల సహకార సంఘం ఎలక్షన్లో అమరచింత పార్టీ బలపర్చిన పానెల్ ఘనవిజయం సాధించడంతో సోమవారం ప్రమాణ స్వీకారోత్సవ సందర్భంగా పార్టీ తరపున ముఖ్య అతిథిగా హాజరైన బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి,వారినీ సత్కరించడం జరిగింది. అదేవిధంగా సీనియర్ నాయకులు ఎస్ వెంకటేశ్వర్లు, నరాల నారాయణ, మంగ అంజి, ఉగ్ర నరసింహ, లడ్డు సత్యనారాయణ,వీరన్న గౌడ్, టైలర్ నరసింహ,హనుమంత్ రెడ్డి, బీజేవైఎం నాయకులు, మంగ హరికృష్ణ ఉదయ్ గౌడ్, మొదలగూ వారు పాల్గొనడం జరిగింది.

# ఒడిశా గవర్నర్ ను కలిసిన బీజేపీ తెలంగాణ

**రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ డాక్టర్ ప్రభా గౌడ్**



**హైద్రాబాద్ జులై 13 :** ఒడిశా రాష్ట్ర గవర్నర్ డా. కంభంపాటి హరిబాబుని బీజేపీ తెలంగాణ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ డాక్టర్ ప్రభా గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఆయనకు శాలువా కప్పి పులా గుచ్ఛం ఇచ్చి ఆభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ పరంగా దేశ రాజకీయాలు మొదలగు అంశాలపై ఆత్మీయంగా చర్చించారు.

# వార్త తరంగాలు ఎడిటర్ పుట్టినరోజు వేడుకలు

**కొత్తగూడెంలో. పేదలకు యాచకులకు అన్నదానం**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి**











**కొత్తగూడెం జూలై 13 (స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో వార్త తరంగాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రత్నకుమార్ ఆధ్వర్యంలో వార్తా తరంగాలు ఎడిటర్ కే ఏ విజయరాజ్ పుట్టినరోజు వేడుకలు రైల్వే స్టేషన్ బస్టాండ్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి పాల్గొని కేక్ కటింగ్ చేసి వార్తా తరంగాలు ఎడిటర్ విజయరాజుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 13 వ తారీకు వార్త తరంగాలు ఎడిటర్ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు బస్టాండ్ రైల్వే స్టేషన్ ప్రాంగణాలలో యాచకులకు పేదలకు అన్నదాన కార్యక్రమం రత్నకుమార్ నిర్వహిస్తారని వారన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు చేసి ఒక పూట పేదవారికి కడుపు నింపే మంచి ఆలోచన మంచి కార్యక్రమం నిర్వహించడం చాలా అభినందనీయమని ఈ సందర్భంగా రత్నకుమారును అభినందించిన మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి . ముందుగా కేక్ కటింగ్ చేసినా అనంతరం యాచకులకు పేదలకు ఆహార పొట్లాలు మినరల్ వాటర్ బాటిల్ అందజేసిన ముఖ్య అతిథి. ఈ సందర్భంగా రత్న కుమార్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి ఎడిటర్ విజయరాజ్ పుట్టినరోజు వేడుకలు కొత్తగూడెంలో నిర్వహించడం జరుగుతుందని పేదవారికి ఒక్కపూట అన్నం పెట్టి విజయరాజ్ మంచి ఆయురారోగ్యాలతో ఉండాలని పేదవారికి అన్నదానం చేయడం జరుగుతుందని ఇలాగే నిరంతరం ప్రతి సంవత్సరం ఇదే విధంగా ఈ అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతుందని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రిపోర్టర్లు కంచి యోహాన్ రిషి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి ని ఘనంగా సన్మానించిన జర్నలిస్టులు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ





**నారాయణపేట, జూలై 13: (స్కైన్యూస్)** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నారాయణ పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ ఆర్డీఓ కార్యాలయం నుండి జిల్లాపాత దవాఖాన వరకు కొనసాగింది. ఈ కార్య క్రమానికి ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. సిద్ధప్ప ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ జనాభా దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సామాజిక, ఆర్థిక, ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించడం అని తెలిపారు. ప్రతి దంపతులు కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబించి, ఆరోగ్యకరమైన చిన్న కుటుంబాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. డాక్టర్ సుధేష్ణ ప్రోగ్రామ్ అధికారి గారు మాట్లాడుతూ బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం పాటించడం వలనఆరోగ్యకరమైన,నైపుణ్యతను కలిగిన బిడ్డను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. మరియు తల్లి--శిశు ఆరోగ్య పరిరక్షణ, కుటుంబ సంక్షేమ సేవలను ప్రభుత్వ ఆరోగ్య సంస్థల ద్వారా ఉచితంగా పొందవచ్చని తెలిపారు.ర్యాలీలో పాల్గొన్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది “ పిల్లలకు సరైన అంతరం ఉంటే కుటుంబాలు ఆరోగ్యంగా నైపుణ్యంతో ఉంటాయి” “చిన్న కుటుంబం సంతోషకరమైన కుటుంబం”, “కుటుంబ నియంత్రణతో ఆరోగ్యకరమైన సమాజం”, “ప్రణాళికాబద్ధమైన కుటుంబమే అభివృద్ధికి పునాది” వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో ప్రోగ్రాం అధికారులు డా సుధేష్ణ, డా. లక్ష్మీ కాంత్, వైద్యదికారి డా తిరుపతి, కోఆర్డినేటర్లు అశోక్ కుమార్, విజయ్ కుమార్, అరవింద్ కుమార్ , సురేష్ , పి ఎచ్ ఎన్ జానకమ్మ, సూపర్వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ఈ ర్యాలీ తో పాటు నారాయణపేట పట్టణంలో జిల్లా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేత, వైస్ చైర్మన్ మంజుల ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆల్బెండ జోల్ మాత్రలను పిల్లలకు వేసి ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించడం ప్రారంబించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ కే సిద్ధప్ప. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాయిరాం డాక్టర్ లక్ష్మీకాంత్, డాక్టర్ సుధేష్ణ, డాక్టర్ సత్య ప్రకాష్, జిల్లా కోఆర్డినేటర్లు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జి పి ఎచ్ ఎస్ కు నూతన భవనం నిర్మించాలి



**ఎ బి వి పి**

**నారాయణపేట జూలై 13: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలో నీ పురాతన పాఠశాల అయిన జి.పి.ఎచ్ ఎస్ కు నూతన భవనం నిర్మించాలనీ సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో భారతీయ విద్యార్థి పరిషత్, నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎ బి వి పి నాయకులు మాట్లాడుతూ నారాయణపేటలోని అతి పురాతనమైన పాఠశాల అయిన ప్రాక్టీసింగ్ ఉన్నంత పాఠశాల శివాజీ నగర్ లోని పాఠశాల60 సంవత్సరాలు నుండి ఉన్నది కానీ పురాతమైనందున అట్టి పాఠశాలను ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ నుండి యాదగిరి రోడ్డుకు మార్చాలని విద్యాశాఖవారు ఆలోచిస్తున్నారన్నారు. ఒకవేళ యాదగిరి రోడ్లోకి మార్చినట్లయితే ప్రస్తుతం ఉన్న పరిసర ప్రాంత విద్యార్థులకు పాఠశాల దూరం అవుతుందని భావన తో వారు పాఠశాలకు వెళ్లలేరన్నారు. దీనితో పాఠశాల విద్యార్థులుసంఖ్య ణియంగా పడిపోతుందన్నారు.ఈ పాఠశాల నిర్మాణ ప్రభుత్వము కూడా సిద్ధంగా ఉన్నది కానీ ప్రభుత్వ స్థలం లేక నిర్మాణం చేపట్టలేదన్నారు.ప్రస్తుతం పాఠశాల ఉన్న దగ్గర్లోనే ఎక్కడైనా ప్రభుత్వ స్థలం గుర్తించి అట్టి స్థలం లోనే పాఠశాల నూతన భవనం నిర్మాణము చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నరేష్ ,నగర కార్యదర్శి సతీష్, చరణ్ రెడ్డి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**షాద్నగర్, జూలై 13 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గంలోని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో ఆయన సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను బీఆర్ఎస్ నాయకులు కేశంపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దత్తాయిపల్లి, తొమ్మిదిరేకుల, కోనాయపల్లి, లెమ్మమిడి, అల్వాల్, సంతాపూర్ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగంధన సర్పంచ్ నాగిల వెంకట్, కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు, పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, తొమ్మిదిరేకుల మాజీ సర్పంచ్ బాలరాజ్ గౌడ్, లెమ్మమిడి డిప్యూటీ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, మాజీ డిప్యూటీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ యదయ్య, బీఆర్ఎస్ నాయకులు మహేష్, యాదయ్య, దినేష్ సాగర్, శశినేత, చంద్రశేఖర్, సంతోష్ రెడ్డి, ఎస్. మహేష్, అల్వాల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై టిడబ్ల్యూజేఎఫ్ ఆందోళన

## కలెక్టరేట్ ముందు నిరసన.. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ





**రంగారెడ్డి జిల్లా, జూలై 13 (స్కై న్యూస్):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల కోసం అవసరమైతే గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రెస్ అకాడమీ చైర్మన్ వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, రైల్వే పాస్, వైద్య, విద్యా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేపీ మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులను విస్మరించి అనర్హులకు అక్రిడేషన్ కార్డులు జారీ చేశారని ఆరోపించారు. అక్రిడేషన్ ప్రక్రియలో జరిగిన అవకతవకల వివరాలను త్వరలోనే బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు శేరీబాయి గణేష్ మాట్లాడుతూ, జర్నలిస్టులను గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు, వైద్య సదుపాయం, జర్నలిస్టుల పిల్లలకు విద్యా సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, కడ్తాల్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వార్తా తరంగాలు ఎడిటర్ విజయరాజ్ సార్ పుట్టినరోజు వేడుకలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...




# కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేలా కృషి చేయాలి

**బూతు స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలి**

**బిజెపి రాష్ట్ర నేతలు నామాజీ,రతంగ్**



**నారాయణపేట జూలై 13: (స్కైన్యూస్)**కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేలా నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలనీ,బూతు స్థాయి నుండి పార్టీని మరింత పటిష్టం చేయాలని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండురెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నూతన బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో నారాయణపేట మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బిజెపి సీనియర్ నాయకులు నాగురావ్ నామాజీ, రతంగ్ పాండు రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా అర్హులైన రైతులకు సంవత్సరానికి కేంద్రం రూ. 6 వేల ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిరుపేదలకు ఇండ్ల నిర్మాణం కోసం కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఉజ్వల పథకం లో భాగంగా అర్హులైన మహిళలకు ఉచిత ఎల్పిజి గ్యాస్ కలెక్షన్లు అందిస్తున్న ఘనత బిజెపికి దక్కిందన్నారు. బోగస్ ఓట్ల తొలగింపు కార్యక్రమంలో భాగంగా ఎస్ ఐ ఆర్ ద్వారా కేంద్రం గొప్ప కార్యక్రమాన్ని తీసుకోవచ్చిందని ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ పత్రంలో తమ వివరాలను నమోదు చేసి బీ ఎల్ ఓ లకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం గ్రామస్థాయి నుంచి ప్రజలను చైతన్యపరిచి హామీలు అమలు అయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకంలో కేంద్రం వాటా ఉందన్న విషయాన్నివివరించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కేంచే శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, గోవర్ధన్ గౌడ్, వెంకట్ రాములు, సర్పంచులు నాగిరెడ్డి, చంద్రశేఖర్, వెంకటేష్, రాందాస్, మాజీ సర్పంచులు రామకృష్ణ, శివప్ప, అశోక్, బాల్ రెడ్డి, నరసింహులు తో పాటు మండల కార్యవర్గ క్రియాశీల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## షాబాద్ ఆరు హత్యల కేసు ప్రధాన నిందితుడు ఆత్మహత్య



**రంగారెడ్డి జిల్లా జూలై 13 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్ కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజ్‌కుమార్ తన సొంత మేనమామ ఊరైన పెంజర్లలో ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే పోలీసు ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన బిజెపి రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి







**ఆత్మకూర్ జులై 13(స్కై న్యూస్) :**ఆత్మకూరు పట్టణంలోనే జాతర మైదానంలో క్రీడాకారుల అభ్యర్థుల మేరకు 240 వార్స్ లైట్లను మేడపల్లి గ్రామంలో ఐమాక్స్ లైటుకు భూమి పూజ చేసి ఆత్మకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఉన్న సమస్యలను తెలుసుకొని సొంత నిధులతో బోర్వెల్ వేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. తదుపరి ఆత్మకూర్ ఎంపీడీవో ఆఫీస్ లో శ్రీరామ్ గారిని కలిసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల్లో పార్టీలకు అతీతంగా అర్హులైన అభ్యర్థులకు పథకాలు అందించాలని సూచించారు కార్యక్రమాలను ఉద్దేశించి లక్ష్మీకాంత్ రెడ్డి గారు మాట్లాడుతూ మండలంలోని కార్యకర్తలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను ఎంపీ డీకే అరుణ గారిచొరవ చూపి వెంటనే పూర్తి చేస్తానని తెలియజేశారు మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ యాదవ్ గారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను మనస్పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలంటే రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని సూచించారు మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ యాదవ్ మండ్లసురేష్ గారి అధ్వానంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ గారు ముక్తల్ కాన్స్టెన్సీ కో కన్వీనర్ రేచింతల శ్రీనివాసులు గారు జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆంజనేయులు ముదిరాజు గారు ఉప సర్పంచ్ ఎల్లన్న గారు జిల్లా నాయకులు నరేంద్ర గౌడ్ గారు రాఘవేందర్ రెడ్డి తిమ్మప్ప మహేందర్ రెడ్డి తదితర వ్యక్తులు పాల్గొన్నారు

## జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రారంభం..

**1--19 ఏళ్ల పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలి..**

**మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



**రంగారెడ్డి జిల్లా, జూలై 13 (స్కై న్యూస్):** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని 12వ వార్డు ఫరూక్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నులిపురుగుల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలందరికీ ఆల్బెండజోల్ (400 మిల్లీగ్రాములు) మాత్రలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. నులిపురుగులు పిల్లలకు ఆహారం ద్వారా లభించే పోషకాలను గ్రహించడం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుందని, పిల్లలు బలహీనంగా మారి చదువుపై దృష్టి సారించలేకపోతారని వివరించారు. ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగుల సమస్యను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్లు దిలీప్, పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, రాజు నాయక్, మండల విద్యాధికారి మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ముబారక్ అలీ ఖాన్, మాధవులు యాదవ్, గంగమోని సత్తయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం చేస్తారా..?కారుణ్య మరణానికి అనుమతి ఇస్తారా...?


**కలెక్టరేట్ ప్రజావాణిలో రిటైర్డ్ ఉపాధ్యాయుడి హాల్ చల్**

**తహసీల్దార్,డి టి లను సస్పెండ్ చేయాలని డిమాండ్**



**నారాయణపేట జూలై 13: (స్కైన్యూస్)** నారాయణపేట కలెక్టరేట్ లో సోమవారం జరిగిన ప్రజావాణిలో నారాయణపేట మండలం కోటకొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తనకు న్యాయం. చేస్తారా లేక నాకు కారుణ్య మరణానికి అనుమతి ఇస్తారా అంటూ ప్లేకార్డు ప్రదర్శిస్తూ హాల్ చల్ చేశారు.తనకు అన్యాయం చేసిన నారాయణపేట తహసీల్దార్ ను,కలెక్టరేట్ లో ఉన్న దితి బాలరాజును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట మండలం అభాంగాపూర్ శివారులో కోటకొండకు చెందిన వ్యక్తి కరుబసప్ప ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా ఆభూమిలో ఆయిల్ ఫాం సాగు చేస్తున్నాడనీ తెలిపారు అంతే కాకుండా ఆక్రమించిన ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేయడంతో ఆపై భాగంలో ఉన్న దాదాపు 50 ఎకరాలకు పైగా బాటలేక సభ్యులు బీడుగా మారాయి.ఈ విషయంపై తను గత మూడేళ్లుగా పోరాటం చేస్తున్న రెవిన్యూ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదన్నారు.కరుబసప్ప సర్వే నెంబర్ 524 ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు సర్వే లో తేలినా ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని చంద్ర శేఖర్ తెలిపారు. ఈ వ్యవహారం మొత్తం తహశీల్దార్ అవినీతి కారణంగానే జరిగిందని తెలిపారు.కాగా ఫిర్యాదు చేస్తే తననే కేసు పెడతానని తహసీల్దార్ భయపెడు తున్నారనిఅన్నారు.ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రం సమర్పించినా న్యాయం జరుగడం లేదని అన్నారు.జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఆయిల్ ఫాం సాగు చేస్తూ ప్రభుత్వ పరంగా సబ్సిడీ పొందుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆవ్యక్తి సహకరిస్తున్న నారాయ ణపేట తహశీల్దార్,డి టి పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజల నిరసన



**రంగారెడ్డి జిల్లా, జూలై 13 (స్కై న్యూస్):** కొత్తూరు మండలం సిద్ధాపూర్ శివారులో ప్రతిపాదిత ఎకో టౌన్‌షిప్, డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపు మేరకు పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో సిద్ధాపూర్‌కు చేరుకుని నిరసన చేపట్టారు. అనంతరం సిద్ధాపూర్ నుంచి ర్యాలీగా బయలుదేరిన నిరసనకారులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించేందుకు షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయానికి తరలివెళ్లారు. “మన గ్రామాలను మనం కాపాడుకుందాం” అంటూ ప్రజలు నినాదాలు చేశారు.

వార్తాతరంగాలు
మంగళవారం 14 జూలై 2026

# ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## మక్తల్ సభలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి







**నారాయణపేట జూలై 13 (స్పైన్యూస్)** మక్తల్ నియోజక వర్గంలో రూ. 573.28 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి తో కలిసి శంకుస్థాపన చేసిన కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మక్తల్ నియోజకవర్గంలో హ్యామ్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమం కోసం విచ్చేసిన రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ఞ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘన స్వాగతం పలికారు.అనంతరం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ తో పాటు ప్రజాప్రతినిధులు కలిసి రూ.237 కోట్లతో నిర్మించనున్న మక్తల్--నారాయణపేట నాలుగు లైన్ల హ్యామ్ రోడ్డుకు శంకుస్థాపన చేసి, హ్యామ్ రోడ్ల పైలాన్‌ను మంత్రి కోమటి రెడ్డి. వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... మక్తల్ నియోజకవర్గంలో రూ.573.28 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేశాం. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రి కాక ముందు నుంచే ప్రతి సమావేశంలో మక్తల్--నారాయణపేట రహదారి గురించి ప్రస్తావిస్తూ, ఈ రోడ్డు నిర్మాణాన్ని మంజూరు చేయాలని నిరంతరం కోరేవారని, ఆ విజ్ఞప్తికి అనుగుణంగానే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందని ఆయన తెలిపారు.గతంలో తాను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రిగా ఉన్నానని, ఇక్కడి రహదారుల పరిస్థితిపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉందనీ, గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్, రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖల్లో చేపట్టిన పనులకు సుమారు రూ.40 వేల కోట్ల బకాయిలు మిగిల్చడంతో పాటు రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పుల భారం రాష్ట్రంపై మోపారని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రోడ్లను సరిగా అభివృద్ధి చేయకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆయన విమర్శించారు. ఈ రోజు శంకుస్థాపన చేసిన మక్తల్--నారాయణపేట రహదారిని 12 నుంచి 16 నెలల్లో పూర్తి చేసి, ప్రజలు కేవలం 20 నిమిషాల్లో నారాయణపేటకు చేరుకునేలా నిర్మిస్తామని తెలిపారు. రహదారి విస్తరణకు ప్రజలు సహకరించి అవసరమైన భూమిని ఇవ్వాలని, భూములు ఇచ్చే వారికి ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తుందనీ, రహదారి నిర్మాణం విషయంలో అవసరమైన పరిపాలన అనుమతులన్నింటినీ తొందరగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ను మంత్రి ఆదేశించారు. మంచి రహదారులు ఉంటేనే పరిశ్రమలు వస్తాయనీ, వ్యాపారాలు పెరుగుతాయని, యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, అభివృద్ధికి నాణ్యమైన రోడ్లే పునాది అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలం నాటి బిల్లుల కోసం ఇప్పటికీ కాంట్రాక్టర్లు తిరుగుతున్నా, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్లతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందనీ, అన్నింటికి కలిపి ఏడాదికి 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. గత పదేళ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వని పరిస్థితి ఉండగా, తమ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని చెప్పారు. తాము ప్రచారం కంటే పనులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం అని మంత్రి స్పష్టం చేశారు. సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఒక్క ప్యాకేజీలో రూ. 547 కోట్లు అందులో 4 లైన్ల రోడ్డు నిర్మాణం అంటే ఆషామాషీ కాదు అని అన్నారు. రోడ్డు వ్యవస్థ ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి పట్టుదల, ఏమన్నా చేయాలన్న తపన ఉన్న నాయకుడు అని కొనియాడారు. సాగునీటి పరంగా మక్తల్ మంచి పురోగతి సాధిస్తుందని, వచ్చే ఎన్నికల నాటికి సాగునీటి వనరులు ఇక్కడ గణనీయంగా పెరుగుతాయని జూపల్లి తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలోనే 30వేల కోట్ల తో ఇందిరమ్మ ఇండ్లను నిర్మింప చేస్తున్నామన్నారు. ఇటీవల రోజు 1000 కోట్లు రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ప్రతీ నియోజక వర్గంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మింప చేస్తున్నామని మంత్రి తెలిపారు. వాకిటి శ్రీహరి నేతృత్వంలో మక్తల్ నియోజక వర్గ రూపురేఖలు మారుతాయని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

**సభకు అధ్యక్షత వహించిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ...**

మక్తల్ నియోజకవర్గంలో ఈరోజు ప్రారంభమైన రోడ్ల నిర్మాణ పనులు చారిత్రాత్మకమైనవని అన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల అవసరాలనే ప్రాధాన్యంగా తీసుకొని ఈ భారీ రహదారి ప్రాజెక్టులను మంజూరు చేసిందని తెలిపారు. మక్తల్ నుంచి నారాయణపేట వరకు రహదారి నిర్మాణం ఎన్నో ఏళ్లుగా అగ్నిపరీక్షగా మారిందన్నారు. దాదాపు పది మంది జిల్లా పాలన అధికారులు, పలువురు ఎమ్మెల్యేలు మారినా ఈ రోడ్డు మంజూరు కాలేదని గుర్తు చేశారు.గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో గొప్పలు చెప్పిందని, కానీ నాణ్యమైన రహదారుల నిర్మాణంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పదేళ్ల పాటు మాటలు, ప్రచార ఆర్భాటాలు, రంగురంగుల హామీలతో ప్రజలను మోసం చేశారన్నారు. నిర్మించిన రహదారులు కూడా నాసిరకంగా ఉండటంతో వందలాది గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల రవాణా కష్టాలు తొలగించాలనే సంకల్పంతో రూ.237 కోట్లతో మక్తల్--నారాయణపేట నాలుగు లైన్ల రహదారిని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.మక్తల్ నియోజకవర్గానికి ఏ అభివృద్ధి పని కోరినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులు వెంటనే సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని, ఇందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన మక్తల్ నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధి బాటలో దూసుకుపోతోందని, ప్రజలు స్వేచ్ఛగా, గౌరవంగా జీవించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.మక్తల్ అభివృద్ధి ప్రయాణానికి ప్రజల ఆశీర్వాదం, సహకారం ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస, మార్కెట్ చైర్మన్ లు రాధా లక్మారెడ్డి, సదా శివా రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, ఆర్ అండ్ బీ సీ . ఈ .వెంకటేశ్వర్ రావు, ఎస్.ఈ రాజేందర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి..

### చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి



**రంగారెడ్డి జిల్లా, జూలై 13 (స్పై న్యూస్):** జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలను చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి ఏడాదిలో రెండుసార్లు ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండాజోల్ మాత్రలను అందిస్తోందన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని, అందుకే ప్రతి చిన్నారికి తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. జూలై 20న కూడా ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, డాక్టర్ ఎ. వేదశ్రీ, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయం వద్ద పోలీసుల భారీ బందోబస్తు..



**షాద్‌నగర్, జూలై 13 (స్పై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపురం గ్రామంలో ప్రతిపాదిత ఎకో టౌన్‌షిప్, డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిద్ధాపూర్ పోరాట కమిటీ పిలుపు మేరకు గ్రామస్థులు, స్థానిక నాయకులు సోమవారం షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు సమర్పించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నారనే సమాచారంతో పట్టణ సీఐ సీతారాం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

## ఎన్సిసి క్యాడెట్ల ఎంపిక



**పాపన్నపేట, జూలై 13 (వార్తతరంగాలు):** మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్సిసి మొదటి సంవత్సరం క్యాడేట్ల ఎంపిక కార్యక్రమం ఎన్సిసి అధికారి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ అధికారి సర్వన్ సింగ్ హాజరై విద్యార్థులకు వివిధ రకాల ఈవెంట్స్ నిర్వహించి 53 మంది క్యాడెట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపిక కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మహేశ్వర్, మాజీ ఎన్సిసి అధికారి ప్రవీణ్ కుమార్,భట్టు నాగరాజు తోపాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా

# కొత్తూరులో మహాధర్నా..





**రంగారెడ్డి జిల్లా, జూలై 13 (స్పై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కొత్తూరు ఎన్‌హెచ్-44పై సోమవారం పార్టీలకు అతీతంగా మండల నాయకులు, సర్పంచులు, రైతులు, మహిళలు, యువకులు భారీ స్థాయిలో మహాధర్నా నిర్వహించారు. సిద్ధాపూర్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో నిరసనకారులు పాదయాత్రగా చేరుకుని డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, పరిస్థితిని అదుపులోకి తీసుకున్న పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో పరిసర గ్రామాలు, గిరిజన తండాలు, వేలాది మంది రైతుల జీవనోపాధికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి

# ప్రభుత్వ నిధుల పూర్తి వినియోగం





చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**రంగారెడ్డి జిల్లా , జూలై 13 (స్పై న్యూస్):** ప్రభుత్వ నిధులను వంద శాతం సద్వినియోగం చేసుకుంటూ చేవెళ్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పామెన వార్డులో రూ.25 లక్షల సొంత నిధులతో కౌన్సిలర్ గోపాల్ రెడ్డి నిర్మించిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అలాగే రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి, నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా సొంతంగా చొరవ తీసుకుని అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు.కౌన్సిలర్ గోపాల్ రెడ్డి నాలుగు రోజుల్లోనే బీటీ రోడ్డు పనులు పూర్తి చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో అంతర్గత రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, మహిళల సాధికారత కోసం ఇందిరా మహిళా భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రాబోయే రోజుల్లో చేవెళ్లను మరింత సుందరంగా, అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో జరిగిన

# అభివృద్ధి కనిపించడం లేదా?

### బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ హఫీజ్..



**రంగారెడ్డి జిల్లా, జూలై 13 (స్పై న్యూస్):** జిల్లేడు చౌదర్‌గూడ మండలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను విస్మరించి కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హయాంలో సబ్‌స్టేషన్లు, రైతు వేదికలు, సీసీ, బీటీ రోడ్లు, కొత్త గ్రామపంచాయతీలు, పల్లె ప్రకృతి వనాలు, స్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు వంటి అనేక అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించిందన్నారు. ప్రస్తుతం మండలంలో కనిపిస్తున్న అభివృద్ధి అంతా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినదేనని పేర్కొంటూ, గత ప్రభుత్వ పనులను కించపరిచే వ్యాఖ్యలు చేయకుండా ప్రస్తుత పాలకులు కూడా అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పడకటి వెంకటేష్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై

# కేకే కమిటీతో సమావేశం..



**రంగారెడ్డి జిల్లా, జూలై 13 (స్పై న్యూస్):** మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులతో కేకే కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో షాద్‌నగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ షాద్‌నగర్ అధ్యక్షుడు టీజీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అధికారిక గుర్తింపు కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు అందించడంతో పాటు 250 గజాల ఇంటి స్థలాలను కేటాయించాలని కమిటీని కోరారు. టీజీ శ్రీనివాస్ మాట్లాడుతూ, కేకే కమిటీ ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి కుల సంఘాలతో కూడా సమావేశాలు నిర్వహించాలని, నిజమైన ఉద్యమకారులను ఆనాటి జేఏసీ, మీడియా ఆధారంగా గుర్తించాలని సూచించారు. అలాగే తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని కమిటీ ద్వారా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు రెడ్డి, రవికుమార్ గౌడ్, మేకల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 175/175.. పవన్ సరికొత్త వ్యూహం!



జనసేన పార్టీని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే వ్యూహానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా పార్టీని పోలింగు బూతు స్థాయిలో బలపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. 2014లో పార్టీ ప్రారంభించిన నుంచి జనసేనాని సెంట్రిక్ గానే పార్టీ కార్యకలాపాలు నడిచాయి. మధ్యలో కొందరు కార్యకర్తలు పార్టీలో చేరిన క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణపై ఇప్పటివరకు ఫోకస్ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఆదరణ ఉన్నప్పటికీ పోలింగు బూతు స్థాయిలో ఓటర్లను సమన్వయం చేసే కేడర్ లేక జనసేన బలం కొంతవరకే పరిమితం అన్న అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో పవన్ కీలక నిర్ణయం తీసుకున్నారు.

మరికొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీకి పోలింగు బూతు లెవల్ లో కమిటీలు వేయాలని పవన్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో వాటా పొందుతోంది. స్థానిక ఎన్నికల్లో కూడా జనసేనకు ప్రాతినిధ్యం పెరగాలని, క్షేత్రస్థాయి కార్యకర్తలకు స్థానికంగా గౌరవం దక్కాలంటే స్థానిక ఎన్నికల్లో గెలవడం అత్యావసరమని జనసేనాని భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇటీవల పార్టీలో చేరికల కమిటీని నియమించడంతోపాటు పార్టీలో తొలి నుంచి కష్టపడిన కార్యకర్తలను గుర్తించేందుకు మరో కమిటీని నియమించారు.

ఈ విధంగా పార్టీని బలోపేతం చేయడానికి పవన్ దశలవారీగా చర్యలు తీసుకుంటుండటం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది. జనసేన పార్టీ స్థాపించి ఇప్పటికి 12 ఏళ్లు అవుతోంది. ఈ పుష్కర కాలంలో పార్టీ విస్తరణపై పవన్ ఎప్పుడు ఇంతలా దృష్టి పెట్టలేదని అంటున్నారు. దీంతో వచ్చే మూడు నెలలో జనసేన పార్టీ భవిష్యత్తు కీలక మలుపు తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇంకా మరో మూడేళ్లు పదవీ కాలం ఉండటం, స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండే అంచనాలు వ్యక్తమవుతుండటంతో జనసేనాని వ్యూహం సత్ఫలితాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో జనసేన కేడర్ లో జోష్ కనిపిస్తోంది. అదే సమయంలో ఇతర పార్టీల నుంచి పదవుల ఆశతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు జనసేనలో చేరే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తంగా జనసేనాని వ్యూహానికి తగినట్లు పార్టీని రాష్ట్రంలో 175 నియోజకవర్గాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల లోగా 175 నియోజకవర్గాల్లోనూ బూత్ కమిటీలు నియమించాలనే లక్ష్యంతో జనసేన నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ బూతు కమిటీలే పార్టీకి కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈ పరిణామం ఒక విధంగా విపక్షంతోపాటు కూటమిలోని ప్రధాన పార్టీలు అప్రమత్తం అవ్వాల్సిన పరిస్థితులు సూచిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

# విశాఖలో భూప్రకంపనలు.. అతి చేస్తున్న మీడియా



ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున స్వల్ప భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగాళాఖాతంలో సంభవించిన ఈ భూకంపం ప్రభావం విశాఖపట్నంతో పాటు కాకినాడ నుంచి విజయనగరం వరకు పలు ప్రాంతాల్లో స్వల్పంగా కనిపించింది. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ రిపోర్ట్ ప్రకారం.., ఆదివారం తెల్లవారుజామున 5:05 గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. కాకినాడ తీరానికి దాదాపు 225 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున దీని కేంద్రం ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. ఈ భూప్రకంపనలు చాలా స్వల్పంగా ఉండటంతో ఎటువంటి ప్రాణనష్టం గానీ.. ఆస్తి నష్టం గానీ సంభవించలేదు. తెల్లవారుజామున 5 గంటల సమయం కావడంతో అత్యధిక శాతం మంది ప్రజలు గాఢ నిద్రలో ఉండటం వల్ల అసలు భూప్రకంపనలు వచ్చాయనే విషయమే చాలామందికి తెలియలేదు. మేల్కొని ఉన్న కొద్దిమంది మాత్రమే స్వల్పంగా భూమి కంపించినట్లు గుర్తించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. భయపడాల్సిన పరిస్థితి అస్సలు లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అయినా ఈ చిన్న విషయాన్ని కొందరు సామాజిక మాధ్యమాల్లో, వార్తల్లో పెద్దదిగా చూపే ప్రయత్నం చేశారు. వాస్తవం ఇలా ఉంటే కొన్ని మీడియా సంస్థలు మాత్రం వ్యూస్, టీఆర్పీ రేటింగుల కోసం ఈ ఘటనపై తీవ్రంగా -అతి- చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. --వైజాగ్ లో భారీ భూకంపం-- అంటూ దారుణమైన, భయానకమైన హెడ్డింగులతో లైవ్ ప్రోగ్రామ్‌లు, తప్పుడు థంబ్‌నైల్స్ పెట్టి సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానెళ్లలో హల్చల్ చేయడం స్థానిక ప్రజలకు అస్సలు నచ్చడం లేదు. వాస్తవ తీవ్రతను దాచిపెట్టి... కేవలం క్లిక్ బైట్స్- విజిబిలిటీ పెంచుకోవాలనే కొన్ని మీడియా ఛానెళ్ల మూర్ఖత్వాన్ని నెటిజన్లు, విశ్లేషకులు తప్పుపడుతున్నారు.ఇలా మీడియా అతి చేయడం విశాఖ విషయంలో ఇదే మొదటిసారి కాదు. ఇటీవల పరవాడ పరిసరాల్లోని ఫార్మా కంపెనీలలో జరిగిన కొన్ని చిన్నపాటి, చెదురుముదురు ప్రమాదాలపైనా కొన్ని మీడియా సంస్థలు ఇలాగే ఘోరమైన హెడ్డింగులు పెట్టి టీఆర్పీ గేమ్స్ ఆడటానికి ప్రయత్నించాయి. పరిశ్రమల్లో జరిగిన చిన్న సాంకేతిక లోపాలను కూడా నగరానికేదో ముప్పు ముంచుకొచ్చినట్లు కలరింగ్ ఇస్తూ వార్తలు ప్రసారం చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పకుండా అబద్ధపు హైప్ క్రియేట్ చేయడం బాధ్యతారాహిత్యమే అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తులు లేదా ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వారికి ధైర్యం చెప్పడం మీడియా ప్రాథమిక బాధ్యత. అంతేకాని చిన్నపాటి స్వల్ప ప్రకంపనలను కూడా భారీ భూకంపాలుగా చిత్రీకరించి సమాజంలో అనవసర భయాందోళనలు సృష్టించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట వేస్తూ..బాధ్యతాయుతమైన జర్నలిజం వైపు మీడియా అడుగులు వేయాలని..రేటింగుల పిచ్చిని పక్కనపెట్టి వాస్తవాలను మాత్రమే ప్రజల ముందుంచాలని విశ్లేషకులు హితవు పలుకుతున్నారు.

**భూకంపంపై ప్రజా స్పందన :**

విశాఖపట్నం తీరంలో సంభవించిన స్వల్ప భూప్రకంపనలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు భిన్నమైన అనుభవాలను, అభిప్రాయాలను షేర్ చేస్తున్నారు. విశాఖ నగరంలోని మద్దిలపాలెం, మధురవాడ, సీతమ్మధార, ఎన్ఏడి, కూర్మన్నపాలెం.. అలాగే విజయనగరం వంటి పరిసర ప్రాంతాల ప్రజలు తెల్లవారుజామున 5:00 నుండి 5:15 గంటల మధ్యలో తమకు ఎదురైన అనుభవాలను లైవ్ చాట్‌లో రాసుకొచ్చారు. కొందరు నిద్రలో ఉన్నప్పుడు వింత శబ్దాలు వచ్చాయని.. మరికొందరు బెడ్‌రూమ్‌లోని మంచం, అల్మారా

కొన్ని సెకన్ల పాటు కదిలాయని పేర్కొన్నారు. ఉదయాన్నే పూజ చేసుకుంటున్న సమయంలో లైట్‌గా షేక్ అవ్వడంతో మొదట భ్రమ అనుకున్నామని... కానీ మీడియా లైవ్ చూశాకే అది భూకంపమని తెలిసిందని కొందరు నెటిజన్లు ధృవీకరించారు. ఈ ప్రకంపనలపై కొందరు నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేయగా.. మరికొందరు మాత్రం --ఇది చాలా స్వల్ప తీవ్రత కలిగింది..అంతా పిచ్చ లైట్, భయపడాల్సిన పనిలేదు-- అంటూ ధైర్యం చెప్పారు. ఇదే సమయంలో ఈ ప్రకృతి పరిణామాన్ని కొందరు దైవచింతనతో - పాపపుణ్యాలతో ముడిపెడుతూ కామెంట్లు చేయడం గమనార్హం. సమాజంలో పాపాలు పెరిగిపోవడం వల్లే భగవంతుడు ఇలాంటి హెచ్చరికలు ఇస్తున్నాడని... ఇప్పటికైనా మనుషులు మంచితనంతో నడుచుకోవాలని దైవభక్తితో కూడిన హితవులు పలికారు. మొత్తానికి మీడియా చూపిస్తున్న అతితో సంబంధం లేకుండా, నెటిజన్లు తమ స్వంత అనుభవాలను షేర్ చేయడంతో వాస్తవం ఏమిటో అవగతమవుతోంది.

## హర్మూజ్ మళ్లీ మూసివేత.. ప్రపంచానికి చమురు సంక్షోభం.. అట్టుడుకుతున్న పశ్చిమాసియా!

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య దశాబ్దాలుగా సాగుతున్న వైరం ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరినట్లు కనిపిస్తోంది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మరోసారి మూసివేస్తున్నట్లు ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. గల్ఫ్ రీజియన్‌లో అమెరికా సైనిక జోక్యం పూర్తిగా ముగిసేవరకు తమ అనుమతి లేకుండా ఏ ఒక్క నౌకను కూడా ఈ మార్గం గుండా వెళ్లనిచ్చేది లేదని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తెగేసి చెప్పింది. ఇరాన్ తీసుకున్న ఈ దూకుడు నిర్ణయంతో అంతర్జాతీయంగా ఒక్కసారిగా ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఉద్రిక్తతలకు కారణమైన నౌకపై కాల్పుల ఘటన**

ఇరాన్ ఈ అధికారిక ప్రకటన చేయడానికి కొద్ది గంటల ముందే గల్ఫ్ తీరంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సైప్రస్ జెండాతో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌక, తమ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ అనధికారిక మార్గంలో ప్రయాణించిందని ఇరాన్ ఆరోపించింది. దీనిపై స్పందించిన ఇరాన్ బలగాలు సదరు నౌకపై కాల్పులు జరిపాయి. ఈ ఘోర దాడిలో నౌకలోని ఓ సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ఈ ఘటనపై అమెరికా రక్షణ మంత్రి తీవ్రంగా స్పందించారు. ఇరాన్ అనాగరిక చర్యలను ఎంతమాత్రం సహించబోమని, దీనికి ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

**అమెరికా మూడో విడత దాడులు.. 140 లక్ష్యాలు ధ్వంసం!**

రక్షణ మంత్రి హెచ్చరించిన కొద్ది సేపటికే అమెరికా రంగంలోకి దిగింది. ఇరాన్‌పై వరుసగా మూడో విడత భారీ వైమానిక దాడులను ప్రారంభించింది. ఈసారి అమెరికా సైన్యం ముఖ్యంగా హర్మూజ్ తీర ప్రాంతాలు, అలాగే ఇరాన్ వ్యూహాత్మక ప్రాంతమైన బుషెహర్



ప్రావిన్స్‌ను టార్గెట్ చేసింది. ఇరాన్‌కు చెందిన దాదాపు 140 సైనిక, వ్యూహాత్మక లక్ష్యాలను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అమెరికా వైమానిక దాడుల వల్ల తమ సైనిక స్థావరాలతో పాటు పలు కీలక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా అంగీకరించింది.

**అమెరికా బేస్‌లపై ఇరాన్ ప్రతీకార డ్రోన్ దాడులు**

అమెరికా దాడులకు ఇరాన్ కూడా అంతే దీటుగా బదులిచ్చింది. గల్ఫ్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్, బహ్రెయిన్, ఖతార్‌లలోని అమెరికా మిలిటరీ క్యాంపులను తాము విజయవంతంగా లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ముఖ్యంగా ఖతార్‌లోని అతిపెద్ద అమెరికా సైనిక స్థావరం 'అల్ ఉదైద్ ఎయిర్ బేస్' లోని కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను తాము నాశనం చేశామని ఇరాన్ ప్రకటించింది. దీనితో పాటు జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్ బేస్‌పైన కూడా దాడులు చేసినట్లు పేర్కొంది. అయితే ఈ దాడుల తీవ్రతపై అమెరికా గానీ, ఖతార్ గానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

**భారత్‌కు పెరగనున్న ముప్పు?**

ఇరాన్ కేవలం సైనిక స్థావరాలనే కాకుండా, ఒమన్‌లోని వ్యూహాత్మక దుఖ్మ్ ఓడరేవు పై కూడా దాడులు జరిపినట్లు ప్రకటించడం ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ఈ పోర్టు భారత్ సహా ఆసియాలోని అనేక దేశాలకు చమురు సరఫరా చేయడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఇక్కడ ఉద్రిక్తతలు పెరిగితే భారత్‌కు ఇంధన సరఫరా కష్టతరంగా మారే ప్రమాదం ఉంది.

**గ్లోబల్ ఎకానమీపై ప్రభావం ఎంత?**

ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురులో దాదాపు ఐదో వంతు 20% కేవలం ఈ హర్మూజ్ జలసంధి గుండానే రవాణా అవుతుంది. ఒకవేళ ఇరాన్ గనుక ఈ మార్గాన్ని దీర్ఘకాలం పాటు మూసివేస్తే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు రికార్డు స్థాయికి చేరతాయి. షిప్పింగ్ కంపెనీలకు రవాణా వ్యయం, ఇన్సూరెన్స్ ప్రీమియంలు భారీగా పెరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక మాంద్యానికి దారితీసే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఈ యుద్ధ వాతావరణం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా.. ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను ఏ తీరానికి చేరుస్తుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఇరాన్ సీక్రెట్ మిషన్ లీక్? ప్రపంచానికి డేంజర్ బెల్




మధ్యప్రాచ్యంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు మరో కొత్త మలుపు తిరిగాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల తర్వాత ఇరాన్ కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపించినా.. తెరవెనుక మాత్రం సంచలన వ్యూహాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఇరాన్ నిశ్శబ్దంగా తన సైనిక, అణు సంబంధిత మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను ప్రారంభించిందా? అనే ప్రశ్న ఇప్పుడు అంతర్జాతీయ సమాజంలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఉపగ్రహ చిత్రాలు ఇరాన్‌లోని కొన్ని అత్యంత రహస్య ప్రాంతాల్లో భారీగా పెరిగిన అనుమానాస్పద కదలికలను బట్టబయలు చేశాయి.

**పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్‌లో ఏం జరుగుతోంది?**

ఈ తాజా వివాదంలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధాన ప్రాంతం పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్. గతంలో పశ్చిమ దేశాల నిఘా సంస్థలు ఈ ప్రాంతాన్ని ఇరాన్ అణ్వాయుధ పరిశోధనలకు కేంద్రంగా గుర్తించాయి. ఇటీవల జరిగిన దాడుల్లో ఇక్కడి కొన్ని విభాగాలు దెబ్బతిన్నాయి. అయితే తాజా శాటిలైట్ చిత్రాల ప్రకారం దెబ్బతిన్న సైనిక నిర్మాణాలను వేగంగా నిర్మాణం చేస్తున్నారు. భారీ యంత్రాలతో నేలను సమతలీకరిస్తూ కొత్త నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మిలిటరీ కాంప్లెక్స్ పరిసరాల్లో రాత్రింబవళ్లు వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ఇరాన్ తన వ్యూహాత్మక సైనిక సదుపాయాలను తిరిగి పూర్వ స్థితికి తెచ్చేందుకు అత్యంత రహస్యంగా మిషన్ మోడ్‌లో పనిచేస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి.

**క్షిపణి స్థావరాలపై నిఘా వర్గాల కన్ను**

కేవలం పార్చిన్ మాత్రమే కాకుండా, తబ్రీజ్, కెర్మాన్‌షా సమీపంలోని కీలక క్షిపణి, వైమానిక స్థావరాల్లో కూడా పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు అంతర్జాతీయ నిఘా వర్గాలు గుర్తించాయి. ముఖ్యంగా భూగర్భ సైనిక స్థావరాల వద్ద భారీ కార్గో వాహనాల కదలికలు భద్రతా నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇరాన్‌లోని ప్రధాన అణు కేంద్రాలైన నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్ ప్రాంతాల్లో ప్రస్తుతానికి పెద్దఎత్తున పునర్నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లభించలేదు. అయినప్పటికీ సైనిక స్థావరాల పునరుద్ధరణ వేగం పశ్చిమ దేశాల్లో కలవరం రేపుతోంది.

**అంతర్జాతీయ ఒప్పందాలకు తూట్లు?**

ఈ రహస్య కార్యకలాపాలు గతంలో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అణు అవగాహన ఒప్పంద నిబంధనలపై పెద్ద ప్రశ్న మార్క్‌ను ఉంచుతున్నాయి. ఇరాన్ తన అణు కార్యక్రమాలను కేవలం శాంతియుత అవసరాలకే పరిమితం చేయాలని, అణ్వాయుధాల తయారీ జోలికి వెళ్లకూడదనేది అంతర్జాతీయ నిబంధన. ఒకవేళ ఇరాన్ ఇప్పుడు గీత దాటి సైనిక బలాన్ని పెంచుకుంటే, అది ఒప్పంద ఉల్లంఘనే అవుతుందని పశ్చిమ దేశాలు గట్టిగా వాదిస్తున్నాయి.

**తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి?**

ప్రస్తుతానికి ఈ ఆరోపణలపై ఇరాన్ ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ అమెరికా, యూరప్ దేశాల భద్రతా విశ్లేషకులు ఈ ఉపగ్రహ చిత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. భవిష్యత్తులో ఈ రహస్య మిషన్‌కు సంబంధించి మరిన్ని పక్కా ఆధారాలు లభిస్తే.. ఇరాన్‌పై అంతర్జాతీయ సమాజం కొత్త ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉంది. దౌత్యపరమైన ఒత్తిళ్లు పెంచి ఇరాన్‌ను ప్రపంచ దేశాల ముందు ఒంటరిని చేసే వ్యూహాన్ని రచిస్తున్నారు.ఒకవైపు శాంతి చర్చలు నడుస్తున్నట్లు కనిపిస్తున్నా, మరోవైపు భూగర్భంలో జరుగుతున్న సైనిక ఏర్పాట్లు మధ్యప్రాచ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఈ ఉపగ్రహ చిత్రాల వెనుక ఉన్న అసలు నిజాన్ని తేల్చడానికి ప్రపంచ దేశాలు ఇప్పుడు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

# ఫిన్‌లాండ్‌లో హైదరాబాద్ విద్యార్థి మిస్సింగ్ కేసులో బిగ్ ట్విస్ట్..

ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి అదృశ్యం కేసు ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. ఫిన్‌లాండ్‌లో అనుమానాస్పద స్థితిలో కనిపించకుండా పోయిన వనస్థలిపురానికి చెందిన మణిదీప్‌రెడ్డి కేసులో అక్కడి పోలీసులు కీలక ప్రకటన చేశారు. అయితే పోలీసుల వాదనను మణిదీప్ కుటుంబ సభ్యులు పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. తమ కుమారుడి అదృశ్యం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందంటూ వారు సంచలన ఆరోపణలు చేస్తున్నారు.

**అసలేం జరిగింది?**

హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన మణిదీప్‌రెడ్డి ఇంజినీరింగ్ ఉన్నత విద్యాభ్యాసం కోసం ఫిన్‌లాండ్ వెళ్లారు. అయితే ఈ ఏడాది మే 5న ఆయన అనుమానాస్పద పరిస్థితుల్లో అదృశ్యమయ్యారు. ఆ రోజు నుంచి మణిదీప్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎంతగానో ప్రయత్నించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో తాజాగా ఫిన్‌లాండ్ పోలీసుల నుండి మణిదీప్ తల్లిదండ్రులకు ఒక ఈమెయిల్ వచ్చింది. సముద్రతీరంలో ఒక మృతదేహం లభ్యమైందని, బయోమెట్రిక్ పరీక్షల ఆధారంగా అది మణిదీప్‌రెడ్డిదేనని పోలీసులు ఆ ఈమెయిల్‌లో పేర్కొన్నారు. ఆధారాలుగా మృతదేహం వద్ద దొరికిన కొన్ని వ్యక్తిగత కార్డుల ఫోటోలను కూడా జత చేశారు.

**65 రోజుల తర్వాత ఎలా దొరుకుతుంది? తల్లిదండ్రుల తీవ్ర అనుమానాలు**

ఫిన్‌లాండ్ పోలీసుల ఈ ప్రకటనను మణిదీప్ తండ్రి ముత్యంరెడ్డి తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసుల ఇమెయిల్‌పై ఆయన స్పందిస్తూ పలు కీలక ప్రశ్నలను లేవనెత్తారు. మే 5న అదృశ్యమైన తమ కుమారుడి మృతదేహం, దాదాపు 65 రోజుల తర్వాత సముద్రతీరంలో ఎలా లభిస్తుందని ఆయన ప్రశ్నించారు. అంత కాలం నీటిలో ఉంటే మృతదేహం గుర్తుపట్టేలా ఎలా ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్‌లోని చట్టాల ప్రకారం నిర్దిష్ట గడువులోగా కేసులను క్లోజ్ చేయాల్సి ఉంటుందని, ఆ నిబంధనల వల్లే పోలీసులు వేరే ఎవరిదో మృతదేహాన్ని తమ కుమారుడిదిగా చూపిస్తూ కేసును త్వరగా ముగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ కుమారుడి కోసం తాము స్వయంగా ఫిన్‌లాండ్ వెళ్దామనుకుంటే అక్కడి ప్రభుత్వం తమకు వీసా మంజూరు చేయలేదని ముత్యంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్‌కు చెందిన ఒక వ్యక్తిపై తమకు గట్టి అనుమానాలు ఉన్నాయని, ఆ విషయాన్ని పోలీసులకు చెప్పినా వారు సరిగ్గా దర్యాప్తు చేయలేదని స్పష్టం చేశారు.

**భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

"మా అబ్బాయి ఆచూకీ కోసం ఇప్పటికే మేము భారతదేశంలో హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశాం. ఈ వ్యవహారంలో భారత ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. ఫిన్‌లాండ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పూర్తి స్థాయి నిష్పక్షపాత దర్యాప్తు జరిగేలా చూడాలి" అని ముత్యంరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకున్నారు.

# బిజినెస్

## కీలక వడ్డీరేట్లు పెరుగుతాయ్..

**రాబోయే ఆర్బీఐ ద్రవ్య సమీక్షలపై బొఫా అంచనా**

డిసెంబర్ నుంచి వడ్డింపులకు అవకాశం




న్యూఢిల్లీ, జూలై 10: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను రాబోయే రెండు ద్రవ్య సమీక్షల్లోనైతే యథాతథంగానే ఉంచవచ్చని, డిసెంబర్ నుంచి మాత్రం పెంపులకు ఆస్కారం ఉందని బ్యాంక్ ఆఫ్ అమెరికా (బొఫా) సెక్యూరిటీస్ అంచనా వేసింది. రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు పెరుగవచ్చని తెలిపింది. దీంతో ఈ ఏడాది ఆఖర్లో రుణాలపై వడ్డీరేట్లూ పెరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి.

### ద్రవ్యోల్బణం దెబ్బ

గత ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ద్రవ్యోల్బణం విజృంభిస్తుండటమే కారణం. ఇన్నాళ్లూ దేశ జీడీపీ వృద్ధిరేటుకు ప్రాధాన్యాన్ని ఇస్తూ వస్తున్న సెంట్రల్ బ్యాంక్.. ఇకపై ధరల అదుపునకే పెద్దపీట వేయవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇందుకు బొఫా తాజా అంచనా సైతం అద్దం పడుతున్నది. కాగా, అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఏర్పడిన సంక్షోభం.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్ని ఎగదోస్తున్న సంగతి విదితమే. దీనికిప్పుడు ఎల్ నినో కారణంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండకపోవడం తోడవుతున్నది. దీంతో రాబోయే నెలల్లో రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణం గణాంకాలు, ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం సూచీ బాగానే పెరిగేలా ఉన్నాయి. ఇదే జరిగితే వడ్డీరేట్ల పెంపు ఖాయమన్న విశ్లేషణలే ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులతో గ్రామీణ భారతం ఎక్కువగా ప్రభావితం కావచ్చని అంచనాలున్నాయి.

### ప్రధాన రంగాలపై ప్రభావం

ఆర్బీఐ వడ్డీరేట్లను పెంచితే బ్యాంకులూ రుణాలపై వడ్డీరేట్లను పెంచేస్తాయి. దీనివల్ల కీలక రంగాలకు రుణ సాయం భారమవుతుందని, ఇది చివరకు దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయవచ్చని బొఫా హెచ్చరించింది. ఇప్పటికే ఉత్పాదక రంగం ఒత్తిడిలో ఉన్నది. ఈ క్రమంలో పెరిగే వడ్డీరేట్లు నిర్మాణ, ఆటో, కన్జ్యూమర్ గూడ్స్ రంగాల వృద్ధినీ అడ్డుకోవచ్చని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ కుంటుపడవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గత నెల ద్రవ్య సమీక్షలో.. ఇకపై వడ్డీరేట్ల పెంపులుండవచ్చన్న సంకేతాలు ఆర్బీఐ నుంచి వచ్చినది తెలిసిందే. ఈ క్రమంలో బొఫా అంచనా ప్రాధన్యాన్ని సంతరించుకుంటున్నదిప్పుడు.

# ఈక్విటీలు ఆకర్షణీయం..

## మ్యూచువల్ ఫండ్లలోకి భారీగా పెట్టుబడులు

**జూన్‌లో 26% వృద్ధితో రూ.28,973 కోట్లు రాక**



**న్యూఢిల్లీ :** ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాలు మదుపర్లను ఆకట్టుకుంటున్నాయి. అంతకుముందు నెలతో పోల్చితే గత నెలలో 26 శాతం వృద్ధి చెందాయి. ఈ ఏడాది జూన్‌లో రూ.28,973 కోట్ల పెట్టుబడులు ఈ స్కీముల్లోకి వచ్చాయని శుక్రవారం భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) వెల్లడించింది. మే నెలలో రూ.22,908 కోట్లు వచ్చినట్టు తెలిపింది. ఈ ఏడాది కనిష్ఠ స్థాయి ఇదే కావడం గమనార్హం. కాగా, జూన్ పెట్టుబడులతో ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో ఈక్విటీ ఎంఎఫ్‌లలోకి వచ్చిన మొత్తం పెట్టుబడులు రూ.1.81 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే వ్యవధిలో రూ.1.61 లక్షల కోట్లు రాగా, ఈసారి 12 శాతం పెరిగినైట్టెంది. భౌగోళిక-రాజకీయపరంగా నెలకొన్న ఉద్రిక్తకర పరిస్థితులు తగ్గుముఖం పట్టడం కసొచ్చిందని యాంఫీ ఈ సందర్భంగా అభిప్రాయపడింది. రిటైల్ మదుపర్లు ఎక్కువగా పెట్టుబడులను పెట్టారని కూడా వివరించింది.

**సిప్‌లలోకి..**

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)లలోకి జూన్‌లో వచ్చిన పెట్టుబడులు రూ.31,781 కోట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు నెల రూ.30,954 కోట్లుగా ఉన్నాయి. ఇదిలావుంటే గత నెలలో మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నుంచి తరలిపోయిన పెట్టుబడుల విలువ రూ.52,949 కోట్లుగా ఉన్నది. అయితే మే నెలలో రూ.64,131 కోట్లుగా ఉన్నది. ఇక ఇండస్ట్రీ ఆధ్వర్యంలోని ఆస్తులు జూన్ ఆఖరునాటికి రూ.82.22 లక్షల కోట్లుగా ఉన్నాయి. మే నెల చివర్లో రూ.81.60 లక్షల కోట్లుగా ఉన్నాయి. కాగా, డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)లలో పెట్టుబడుల ఉపసంహరణలు జరిగాయి. అయితే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)లలోకి జూన్‌లో పెట్టుబడుల ప్రవాహం కనిపించింది. మే నెలలో రూ.725 కోట్ల పెట్టుబడులు వెనుకకుపోయాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ప్రథమార్ధంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి వచ్చిన పెట్టుబడుల విలువ రూ.37,319 కోట్లుగా ఉన్నది. గత ఏడాది జనవరి-జూన్‌లో రూ. 8,021 కోట్లే. ఇక రుణ ఆధారిత పథకాల నుంచి గత నెల రూ.1.09 లక్షల కోట్ల పెట్టుబడులు తరలిపోయాయి. మే నెలలోనూ రూ.96,948 కోట్లు వెనుకకుపోయిన విష యం తెలిసిందే.

ఈక్విటీ విభాగంలో పెట్టుబడుల తీరిలా..

మిడ్-క్యాప్ ఫండ్లలోకి రూ.6,090 కోట్లు

స్మాల్-క్యాప్ ఫండ్లలోకి రూ.5,602 కోట్లు

ఫ్లెక్సీ-క్యాప్ ఫండ్లలోకి రూ.5,231 కోట్లు

లార్జ్-క్యాప్ ఫండ్లలోకి రూ.2,067 కోట్లు

గోల్డ్-ఈటీఎఫ్‌లలోకి రూ.3,443 కోట్లు

అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు, మార్కెట్ ఒడిదుడుకులున్నప్పటికీ మదుపర్లు పెట్టుబడులకే పెద్దపీట వేశారు. ముఖ్యంగా జూన్‌లో ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పథకాలు ఆకర్షణీయంగా మారడానికి రిటైల్ ఇన్వెస్టర్లే కారణం. వారి నుంచి పెట్టుబడులు పెద్ద ఎత్తున జరిగాయి.

## ఇండియన్ బ్యాంక్ ఆకర్షణీయం




**న్యూఢిల్లీ** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.3,273 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది ఇండియన్ బ్యాంక్. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.2,973 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. బ్యాంక్ ఆదాయం రూ.18,721 కోట్ల నుంచి రూ.20,724 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.86 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.15 శాతానికి దిగొచ్చాయి. ఇదే సమయంలో మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.376 కోట్ల నిధులను వెచ్చించింది.

## ఐదు సింగరేణి గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్




**హైదరాబాద్ :** సింగరేణి సంస్థకు చెందిన ఐదు గనులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచాయి. ఫైవ్ స్టార్ రేటింగ్‌ను సొంతం చేసుకున్నాయి. 7 విభాగాల్లో, 50 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమ గనుల జాబితాను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసింది ఖైరిగూడ (బెల్లంపల్లి), ఆర్‌జీ ఓసీ -1 (రామగుండం), ఆర్‌కే న్యూటెక్ (శ్రీరాంపూర్), ఆర్‌కే-6 (శ్రీరాంపూర్), జేవీఆర్ ఓసీ -2 (సత్తుపల్లి) లు జాతీయ స్థాయిలో అత్యుత్తమ గనుల జాబితాలో చోటును దక్కించుకున్నాయి. సింగరేణి చరిత్రలో ఒకే సారి ఐదు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్‌ను సొంతం చేసుకోవడం ఇదే తొలిసారి. ఇక మరో 17 గనులు ఫోర్‌స్టార్ రేటింగ్‌ను కైవసం చేసుకున్నాయి.

# భారత్ 285 ఆలౌట్

**మెరిసిన స్మృతి, హర్మన్, దీప్తి**

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 21/1**

**లార్డ్స్‌లో మహిళల ఏకైక టెస్టు**



**లండన్:** మహిళల టి20 ప్రపంచకప్‌లో గ్రూప్ దశలోనే వైదొలిగిన భారత క్రికెట్ జట్టు... ఇంగ్లండ్‌తో ఏకైక టెస్టులో మెరుగైన ప్రదర్శన చేస్తోంది. సుదీర్ఘ చరిత్ర గల లార్డ్స్ మైదానంలో జరుగుతున్న మహిళల తొలి టెస్టులో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియా ఫర్వాలేదనిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో 285 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ స్మృతి మంధాన (108 బంతుల్లో 83; 11 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (121 బంతుల్లో 58; 7 ఫోర్లు), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (87 బంతుల్లో 57; 7 ఫోర్లు) ఆర్ధశతకాలతో రాణించారు. ఈ ముగ్గురు సీనియర్ ప్లేయర్లు ఆచితూచి ఆడగా... మిగిలినవాళ్లు ఎక్కువసేపు నిలవలేకపోయారు. షఫాలీ వర్మ (0) డకౌట్ కాగా... యస్తిక భాటియా (12), రిచా ఘోష్ (13), స్నేహ్ రాణా (13) విఫలమయ్యారు. జెమీమా రోడ్రిగ్స్ (38 బంతుల్లో 35; 5 ఫోర్లు) వేగంగా ఆడింది. ఇంగ్లండ్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 3 వికెట్లు పడగొట్టగా... లౌరన్ ఫిలెర్, ఇస్సీ వాంగ్, మ్యాడీ విలియర్స్ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 11 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 21 పరుగులు చేసింది. చేతిలో 9 వికెట్లు ఉన్న ఆతిథ్య జట్టు... టీమిండియా స్కోరుకు ఇంకా 264 పరుగులు వెనుకబడి ఉంది. కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న టామీ బ్యూమాంట్ (2) విఫలం కాగా... మైయా (17 బ్యాటింగ్), హీతర్ నైట్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ ఒక వికెట్ తీసింది. ఈ మ్యాచ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి అంతర్జాతీయ టెస్టు అరంగేట్రం చేసింది. మ్యాచ్ ఆరంభానికి ముందు శ్రీచరణికి వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టెస్టు క్యాప్ అందజేసింది.

# స్పోర్ట్స్

## ఫైనల్లో హైదరాబాద్



**హైదరాబాద్ :** కెప్టెన్ అభిరథ్ రెడ్డి (49 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 82) దంచికొట్టడంతో టీజీ 20 లీగ్‌లో హైదరాబాద్ ఈ చాంపియన్స్ ఫైనల్ చేరుకుంది. లీగ్ దశలో ఏడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి క్వాలిఫయర్-1లో ఓడిన హైదరాబాద్.. రెండో క్వాలిఫయర్‌లో మాత్రం పంజా విసిరింది. ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో కరీంనగర్ డైమండ్స్‌ను ఓడించింది. డైమండ్స్ ఇచ్చిన 158 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి ఛేదించింది. అభిరథ్‌తో పాటు వికాస్ రెడ్డి (45) కూడా రాణించాడు. తొలుత కరీంనగర్ డైమండ్స్ 20 ఓవర్లలో 157/7 స్కోరు చేసింది. హృషికేశ్ సింహా (38), శుభమ్ శర్మ (31 నాటౌట్) టాప్ స్కోరర్లు. హైదరాబాద్ బౌలర్లలో అజయ్ దేవ్‌గౌడ్, అశ్విన్, ప్రణవ్, తలో మూడు వికెట్లు పడగొట్టారు. అభిరథ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఖమ్మం ఏసెస్‌తో హైదరాబాద్ అమీతుమీ తేల్చుకోనుంది.

# నేడు ఇంగ్లండ్‌తో భారత్ చివరి టి20



సౌతాంప్టన్: ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో తొలి విజయం కోసం నిరీక్షిస్తున్న భారత క్రికెట్ జట్టు నేడు ఇంగ్లండ్‌తో ఆఖరి టి20 మ్యాచ్ ఆడనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టి20 వర్షంతో రద్దు కాగా... ఆ తర్వాత జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా పరాజయం పాలైంది. దీంతో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు 3--0తో సిరీస్ సొంతం చేసుకుంది. మరి శనివారం నామమాత్రమైన చివరి మ్యాచ్‌లోనైనా మనవాళ్లకు ఊరట విజయం దక్కుతుందా చూడాలి. ఈ ఏడాది టి20 ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచిన భారత జట్టు... ఇప్పుడు కనీస ప్రతిఘటన కనబర్చలేని స్థాయికి చేరింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో మనవాళ్లు ఏమాత్రం ఆకట్టుకోలేకపోతున్నారు. ఐపీఎల్ ప్రదర్శనతో జట్టులోకి వస్తున్న ఆటగాళ్లెవరూ... అంతర్జాతీయ స్థాయిలో అదే దూకుడు కనబర్చలేకపోతున్నారు. ఫ్లాట్ పిచ్‌లు, చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలమైన నిబంధనల మధ్య ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన ప్లేయర్లంతా... ఇప్పుడు అనామకులుగా దర్శనమిస్తున్నారు. .

**నిలకడగా...**

మరోవైపు ఇంగ్లండ్ అన్ని రంగాల్లో బలంగా కనిపిస్తోంది. పేసర్లు ఆర్చర్, టంగ్, స్యామ్ కరన్... భారత బ్యాటర్ల బలహీనతలను పసిగట్టి వారిని సులువుగా బుట్టలో వేసుకుంటున్నారు. ఇక బ్యాటింగ్‌లో ఎనిమిదో స్థానం వరకు బ్యాటింగ్ చేయగల సమర్థులు ఉండటం ఇంగ్లండ్ జట్టుకు కలిసొచ్చే అంశం. ఇప్పటి వరకు ఒకటి కంటే ఎక్కువ టి20 మ్యాచ్‌ల సిరీస్‌ల్లో ఇంగ్లండ్ చేతిలో సిరీస్ కోల్పోని టీమిండియా... ఇప్పుడు 'క్లీన్ స్వీప్' ప్రమాదం అంచున ఉంది.






# సుకుమారి వెనకున్న రహస్యం

తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఓ..సుకుమారి’. భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం థియేట్రికల్ ట్రైలర్‌ని అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి లాంచ్ చేశారు. కథానాయిక దామినికి ఊరంతా భయపడుతుంటారు. అందుక్కారణం..ఆమెను ఎవరైనా తాకితే వారికి కరెంట్ షాక్ కొడుతుంది. ఈ రహస్యాన్ని దాచిపెట్టి ఆమెకు హీరోతో పెళ్లి చేస్తారు. ఆ తర్వాత అసలు విషయం తెలిసిన హీరో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు? వారి దాంపత్యం ఎలా సాగింది? అన్నదే ఈ చిత్ర కథాంశం. పల్లెటూరి నేపథ్యంలో ట్రైలర్ ఆద్యంతం వినోదం, భావోద్వేగాల కలబోతగా సాగింది. మురళీధర్ గౌడ్, విష్ణు ఓయి, ఝాన్సీ, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భరత్ మంచిరాజు, దర్శకత్వం: భరత్ దర్శన్.

# మళ్లీ షురూ

‘వారణాసి’ షూటింగ్ పనులు మళ్లీ ఉపందుకున్నాయి. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ‘వారణాసి’. ప్రియాంకా చోప్రా పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌కు ఇటీవల చిన్న విరామం వచ్చింది. దీంతో కుటుంబంతో కలిసి విదేశాలకు విహార యాత్రకు వెళ్లారు మహేశ్‌బాబు. మరోవైపు తన గత చిత్రాలు (ఆర్ఆర్ఆర్, బాహుబలి, ఈగ, మర్యాద రామన్న) పారిస్‌లో ప్రదర్శితమైన నేపథ్యంలో అక్కడికి వెళ్లారు రాజమౌళి. తాజాగా ఈ ఇద్దరూ హైదరాబాద్ చేరకున్నారని సమాచారం. దీంతో ‘వారణాసి’ షూటింగ్ మళ్లీ షురూ అయ్యిందని తెలిసింది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే ప్రారంభం కానుందట. ఈ షెడ్యూల్‌లో మొదట మహేశ్‌బాబు పాల్గొనరని, ఈ నెల 16 తర్వాత పాల్గొంటారని సమాచారం. ఈ షెడ్యూల్‌లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఈ షూట్‌లో దాదాపు 3 వేల మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటారని భోగట్టా. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.





# కనకరాజు వచ్చేది ఆరోజే!

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న ‘కొరియన్ కనకరాజు’ చిత్రాన్ని ఆగస్ట్ 7న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇండియన్-కొరియన్ కల్చర్ కలబోతగా హారర్ కామెడీతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో వరుణ్‌తేజ్ ఓ చేతిలో కత్తి, మరో చేతిలో గ్రెనేడ్ పట్టుకొని రఫ్ అండ్ అల్ట్రాస్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. కొరియన్ గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ కథలో వరుణ్‌తేజ్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: మేర్లపాక గాంధీ.



# ప్రమోషనల్ పోస్ట్‌కు పదిలక్షలు?

సినిమాల పరంగా విజయాలు తక్కువే అయినా అచ్చ తెలుగందం శ్రీలీల క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. అందుకు యూత్‌లో ఈ భామకున్న ఫాలోయింగ్‌ను కారణంగా చెప్పొచ్చు. చూడముచ్చటైన రూపలావణ్యం, చలాకీ నటనతో ఈ భామ కుర్రకారులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఈ సొగసరి సినిమాల కంటే సోషల్‌మీడియా ద్వారానే భారీగా డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిసింది. శ్రీలీల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 17 మిలియన్ల ఫాలోవర్స్ ఉన్నారు. ఈ వేదికలో ఒక్క ప్రమోషనల్ పోస్ట్‌కు ఆమె 5 నుంచి 10 లక్షల వరకు ఛార్జ్ చేస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా నెలరోజుల్లో దాదాపు 50 లక్షల వరకు ఈ భామ ఆర్జిస్తున్నదని ఇండస్ట్రీ ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. సోషల్‌మీడియాలో బ్రాండ్ కొలాబరేషన్స్ ద్వారా పెద్ద మొత్తంలో ఆర్జిస్తున్న కథానాయికల్లో శ్రీలీల ఒకరని చెబుతున్నారు. మరి ఈ వార్తల్లో నిజమెంతో తెలియదు కానీ.. ట్రేడ్ వర్గాల్లో మాత్రం బాగా ప్రచారమవుతున్నది.

# వయనాడ్‌ను రాజకీయ మనుగడ కోసమే వాడుకుంటున్నారు

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించింది. కేరళలోని వయనాడ్‌లో ఇటీవల జరిగిన కొండ చరియలు విరిగిపడిన ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు ఇద్దరూ వెళ్లలేదని ఆరోపించింది. జులై 7న కేరళలోని వయనాడ్ జిల్లాలో అనక్కంపోయిల్- మెప్పాడి ట్విన్ ట్యూబ్ టన్నెల్ ప్రాజెక్ట్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై స్పందించిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి తుహిన్ సిన్హా- ప్రస్తుతం వయనాడ్ లోక్‌సభ ఎంపీగా ఉన్న ప్రియాంక గాంధీ వాద్రా, గతంలో అదే నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన రాహుల్ గాంధీ ఇద్దరూ బాధిత కుటుంబాల్ని పరామర్శించేందుకు వెళ్లలేదని విమర్శించారు. 'సోషల్ మీడియాలో ఒక సంతాప సందేశం పోస్ట్ చేయడం తప్ప బాధితుల వద్దకు వెళ్లి వారిని ఓదార్చే ప్రయత్నం కూడా చేయలేదు. మీరు రాజకీయ పర్యటకులు మాత్రమే. ప్రజలకు అవసరమైన సమయంలో కనిపించరు. అందుకే మీరు పార్ట్ టైమ్ రాజకీయ నాయకులు. ఇది నిజంగా సిగ్గుచేటు' అని తుహిన్ సిన్హా వ్యాఖ్యానించారు. వయవాడ్‌ను గాంధీ కుటుంబం కేవలం తమ రాజకీయ మనుగడ కోసం, రాజకీయ అవసరాల కోసం మాత్రమే ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. 2024 జులైలో వయనాడ్‌లో జరిగిన భారీ కొండ చరియల విపత్తులో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. అప్పట్లో కూడా రాహుల్ గాంధీ ఆలస్యంగా అక్కడికి వెళ్లారని, ఇప్పుడు మరోసారి ప్రజలు కష్టాల్లో ఉన్న



సమయంలో నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని విమర్శించారు.

**వయనాడ్‌లో రాహుల్ గాంధీ అసలేం చేశారు?**

రాహుల్ 2019లో వయనాడ్ నుంచి ఎంపీగా ఎన్నికై, తర్వాత రాయ్‌బరేలీ నుంచి గెలిచిన వెంటనే వయనాడ్‌ను వదిలేశారని అన్నారు సిన్హా. అమేథీ కూడా దశాబ్దాల పాటు అభివృద్ధికి నోచుకోలేదని, అందుకే రాహుల్ చివరకు ఆ నియోజకవర్గాన్ని కూడా వదిలి వెళ్లాల్సి వచ్చిందని విమర్శించారు. ఇప్పుడు ప్రియాంక గాంధీ కూడా భవిష్యత్తులో దిల్లీకి దగ్గరగా మరో సురక్షితమైన నియోజకవర్గం దొరికితే వయనాడ్‌ను వదిలేస్తారని ఆరోపించారు. పర్యావరణం పరంగా అత్యంత సున్నితమైన ప్రాంతమైన వయనాడ్‌లో కొండ చరియల ప్రమాదాల్ని తగ్గించేందుకు రాహుల్ గాంధీ ఎంపీగా ఉన్న సమయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని బీజేపీ ప్రశ్నించింది. 2019 నుంచి 2024 వరకు ఎంపీగా ఉన్నా పర్యావరణ పరిరక్షణ, విపత్తు నివారణ చర్యల విషయంలో గాంధీ కుటుంబం విఫలమైందని విమర్శించింది.

**'మోదీ ప్రతిష్ఠ పెంచుతుంటే రాహుల్ కుట్రలు చేస్తున్నారు'**

మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేపట్టిన విదేశీ పర్యటనలతో భారత్‌కు దౌత్య పరంగా గొప్ప విజయాల్ని తీసుకొచ్చారని బీజేపీ ప్రశంసించింది. ఇదే సమయంలో విదేశాల్లో ఉన్న రాహుల్ గాంధీపై విమర్శలు చేసింది. బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా మాట్లాడుతూ- ప్రధాని మోదీ విదేశీ పర్యటనల ద్వారా భారత ప్రతిష్ఠను మరింత పెంచారని అన్నారు. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా మోదీ విధానాల్ని అనుసరిస్తున్నానని చెప్పడం, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారతదేశంలో మోదీ నాయకత్వంలో వచ్చిన మార్పుల్ని ప్రశంసించడం వంటి అంశాల్ని సంబిత్ పాత్రా ప్రస్తావించారు. అంతర్జాతీయ వేదికపై భారత్‌కు గౌరవం మరింత పెరిగిందని, పలు దేశాలతో సంబంధాలు బలోపేతం అయ్యాయని అన్నారు. 'ప్రధాని మోదీ దేశానికి విజయాల్ని తీసుకొచ్చారు. ఇదే సమయంలో విదేశాల్లో ఉన్న రాహుల్ గాంధీ మూసివేసిన గదుల్లో దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారేమో?' అంటూ సంబిత్ పాత్రా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జులై 10న ప్రయాగ్ రాజ్‌లో జరగాల్సిన రాహుల్ గాంధీ కార్యక్రమం వాయిదా పడిందని, పట్నాలోని మరో కార్యక్రమం కూడా రద్దైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన లండన్, ఐస్‌లాండ్, జర్మనీ వంటి దేశాల్లో పర్యటిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల ఫలితాల్ని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారని, ప్రతిపక్షాలు కూడా వాటిని గుర్తించాలని సంబిత్ పాత్రా సూచించారు.

## అక్టోబర్ 27న ఇజ్రాయేల్‌లో ఎన్నికలు.. నెతన్యాహు ప్రభుత్వానికి ఆఖరి రోజు అదే..!



పశ్చిమాసియాలో యుద్ధం, అస్థిర పరిస్థితులు కొనసాగుతుండగానే ఇజ్రాయేల్‌లో సార్వత్రిక ఎన్నికలకు తెరలేవనుంది. ఈ ఏడాది అక్టోబర్ 27న ఆ దేశంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని లీకుడ్ ప్రభుత్వం నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నందున ఎలక్షన్లకు సమయం వచ్చిందని ఆదివారం ఇజ్రాయేల్ మీడియా తెలిపింది. నెతన్యాహు ప్రభుత్వం జూలై 17 వరకే కొనసాగనుంది. ఇజ్రాయేల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం మరో నాలుగు రోజులే ఉండనుంది. దాంతో, అధికార లీకుడ్ పార్టీ సీనియర్ నాయకుడు అఫిర్ కట్జ్ టైమ్స్ ఇజ్రాయేల్ వార్త సంస్థతో మాట్లాడుతూ.. అక్టోబర్ 27న ఎన్నికలు ఉంటాయని వెల్లడించాయి. 1988 తర్వాత షెడ్యూల్ ప్రకారం నాలుగేళ్లకు జరుగనున్న మొట్టమొదటి ఎన్నికలు ఇవే. అంతేకాదు గత 50 ఏళ్లలో పూర్తికాలం అధికారంలో కొనసాగిన ప్రభుత్వంగా బెంజమిన్ నెతన్యాహు సర్కార్ గుర్తింపు సాధించనుంది.

**జూలై 17 నుంచే**

జూలై 17 నుంచే ఎన్నికల ప్రక్రియ మొదలవ్వనుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా సెప్టెంబర్ 7 కల్లా సిద్ధం కానుందని ఇజ్రాయేల్ మీడియా పేర్కొంది. 120 ఎంపీ స్థానాలకు 61 సీట్లు గెలుపొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అయితే.. నెతన్యాహు నేతృత్వంలోని లీకుడ్ పార్టీకి, గడి ఐసెన్‌కోట్ సారథ్యంలోని యషార్ పార్టీకి ఎన్నికల్లో తలా 23 సీట్లు వస్తాయని ఓ మీడియా సంస్థ అంచనా వేసింది. మరో సంస్థ మాత్రం ఐసెన్‌కోట్ పార్టీకి సంపూర్ణ ఆధిపత్యం లభిస్తుందని తెలిపింది.

## ఇరాన్ ప్రతీకార చర్యలు

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ దేశ దక్షిణ ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్, ఖతార్, ఒమన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతటితో ఆగకుండా హర్మూజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది. తమ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ ద్వారా ఐఆర్జీసీ ఈ వివరాలు వెల్లడించింది. తమ దక్షిణ తీరప్రాంతాల్లోని పలు సైనిక స్థావరాలు, కమ్యూనికేషన్ టవర్లపై యూఎస్ వైమానిక దాడులు చేసిందని పేర్కొంది. దీనికి ప్రతీకారంగా మూడు దశల్లో దాడులు చేశామని తెలిపింది. మొదటి దశలో జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని, అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ల హ్యాంగర్‌ను ధ్వంసం చేశామని వివరించింది.

# నకిలీ 'బనారసీ' చీరల ముప్పు

ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన వారణాసిలోని బనారసీ పట్టు చీరల పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశ విదేశాల నుంచి లక్షలాది మంది బనారసీ చీరల్ని కొనుగోలు చేస్తున్నప్పటికీ వాటిని నేసే నేత కార్మికుల జీవితాలు మాత్రం దయనీయంగా మారాయి. కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నా క్షేత్రస్థాయిలో నేతన్నల బతుకులు మాత్రం ఛిద్రమవుతున్నాయి. ఈ రంగంలో నకిలీ బనారసీ చీరల మార్కెట్ విస్తరించడంతో అసలైన బనారస్ చీరలకు డిమాండ్ తగ్గి వేలాది, లక్షలాది కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతున్నాయి. వారణాసి టెక్స్‌టైల్ పరిశ్రమలోని చీకటి కోణాన్ని, నేతన్నల కన్నీటి గాథలు ఈటీవీ భారత్ తీసుకొచ్చింది. వారణాసిలోని సరయ్యా, జలాలిపురా, లోహ్తా, కాటన్ మిల్ వంటి ప్రాంతాలు ఒకప్పుడు బనారసీ చీరల తయారీకి ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. వేల సంఖ్యలో పవర్‌లూమ్ యంత్రాలు నిరంతరం పనిచేస్తూ ఉండేవి. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పరిశ్రమకు చెందిన వర్గాల అంచనా ప్రకారం సుమారు 50 వేల నుంచి 60 వేల వరకు పవర్‌లూమ్ యంత్రాలు పనిచేయకుండా నిలిచిపోయాయి. దీంతో 4 లక్షల మందికిపైగా నేత కార్మికులు తమ సంప్రదాయ వృత్తిని వదిలి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం లేదా ఇతర చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.






VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137